




PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 259, పేజీలు - 08
గురువారం, మార్చి 5, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## తెలంగాణలో సీపీఎం గతమెంతో ఘనం

# ఇప్పుడు నిర్వీర్యం

### - ఈ నిర్వీర్యానికి బాధ్యత ఎవరిది.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**
తెలంగాణలో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి, రాజకీయాలను శాసించిన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా మార్క్సిస్ట్ సీపీఎం ప్రస్తుతం ఉనికి కోసం పోరాడుతోంది. పార్టీ అంతర్గత సంక్షోభం, ఎన్నికల్లో వరుస పరాజయాలు ఆ పార్టీ ఉందా లేదా అన్న అనుమానాలు రావడానికి కారణం అయ్యాయి. ఇటీవలి కాలంలో ఒక్కటంటే ఒక్క చెప్పుకోదగ్గ విజయం సాధించలేకపోయింది. ఇప్పుడు తమ్మినేని వీరభద్రాన్ని ఆపార్టీ హైకమాండ్ అభిశంసించడం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా కనిపిస్తోంది.

#### అస్తిత్వ పోరాటంలో సీపీఎం

తెలంగాణ రాజకీయాల్లో సీపీఎం ప్రస్థానం ప్రస్తుతం అత్యంత క్లిష్ట దశకు చేరుకుంది. ఉమ్మడి రాష్ట్రంలో కింగ్ మేకర్గా ఉన్న ఈ పార్టీ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత తన ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సున్నం రాజయ్య రూపంలో భద్రాచలం నుండి ఒకే ఒక సీటు సాధించిన సీపీఎం, ఆ తర్వాత 2018 మరియు 2023 ఎన్నికల్లో అసెంబ్లీలో ప్రాతినిధ్యాన్ని పూర్తిగా కోల్పోయింది. గత పదేళ్లుగా చట్టసభల్లో గొంతుక లేకపోవడం ఆ పార్టీ కేడర్ను తీవ్రంగా నిరాశకు గురిచేసింది. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్నామని చెబుతున్నా, అవి ఓట్లుగా మారకపోవడం ఆ పార్టీ వైఫల్యానికి అద్దం పడుతోంది.

#### గ్రామస్థాయిలోనూ క్యాడర్ నిర్వీర్యం

కమ్యూనిస్టులు ముఖ్యంగా సీపీఎంకు గట్టిక్యాడర్ ఉంటుంది. అయితే రాను రాను ఆ క్యాడర్ కూడా మారిపోతోంది. దానికి లోకల్ పోల్సే సాక్ష్యం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సీపీఎం పరిస్థితి దయనీయంగా మారింది. గత మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వందలాది వార్డుల్లో పోటీ చేసినా, కేవలం 10-12 వార్డులను మాత్రమే గెలుచుకోగలిగింది. అటు పంచాయతీ ఎన్నికల్లో కూడా ఒకప్పుడు వందలాది సర్పంచ్ స్థానాలను గెలుచుకున్న పార్టీ, గత ఎన్నికల్లో కేవలం అతి తక్కువ గ్రామ పంచాయతీలకే పరిమితమైంది. నల్గొండ, ఖమ్మం వంటి తమ బలమైన జిల్లాల్లో కూడా ప్రాతినిధ్యం నామమాత్రంగా మారిపోవడం పార్టీ పతనానికి నిదర్శనం.

#### పార్టీని నాశనం చేశారని తమ్మినేని వీరభద్రంపై అభిశంసన

తమ్మినేని వీరభద్రం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సమయంలో పార్టీ రాజకీయంగా ఎదగకపోగా, ఉన్న ఉనికిని కూడా కోల్పోయిందని కేంద్ర కమిటీ భావిస్తోంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో, కొత్త రక్తాన్ని ఎక్కించడంలో ఆయన విఫలమయ్యారని, పైగా పార్టీని తన వ్యక్తిగత ఆకాంక్షల కోసం వాడుకున్నారని విమర్శలు వచ్చాయి. సిద్ధాంతాల కంటే ముఠా రాజకీయాలకే ప్రాధాన్యత పెరగడం వల్ల సామాన్య ప్రజలు పార్టీకి దూరమయ్యారు. అందుకే ఆయనను సొంత పార్టీ అభిశంసించింది. ఒక ఎన్నికల్లో బీఆర్ఎస్తో, మరో ఎన్నికల్లో కాంగ్రెస్తో పొత్తుల కోసం వెంపర్లాడటం వల్ల సీపీఎం సొంత ఓటు బ్యాంకును నిలబెట్టుకోలేకపోయింది. పార్టీ

2లో..

## బీహార్ రాజకీయాల్లో పెను మార్పులు

### - సీఎం పదవికి నితీష్ కుమార్ రాజీనామా.?



**పాట్నా (ప్రశ్న న్యూస్)** బీహార్ రాజకీయాల్లో మరోసారి భారీ మార్పులు జరగబోతున్నాయనే వార్తలు జోరందుకున్నాయి. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ త్వరలో రాజ్యసభకు వెళ్లే అవకాశం ఉందని, దీనిపై జెడియు , బిజెపి అగ్రనాయకత్వం మధ్య తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఒకవేళ నితీష్ కుమార్ ఢిల్లీ రాజకీయాల వైపు అడుగులు వేస్తే, బీహార్ ముఖ్యమంత్రి పీఠం ఖాళీ అవుతుంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేసే అవకాశం ఉంది. నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్లడం ఖాయమైతే, బీహార్లో తమ పార్టీకి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమించాలని బిజెపి గట్టి పట్టుదలతో ఉంది. ప్రస్తుతం కూటమిలో అత్యధిక బలం కలిగిన పార్టీగా బిజెపి ఉన్నందున, ముఖ్యమంత్రి పదవిపై ఆ పార్టీ సహజంగానే తన వాదనను వినిపిస్తోంది. 2026 రాజ్యసభ ఎన్నికల సమీకరణాల్లో ఈ అధికార మార్పిడికి సంబంధించిన సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.
నితీష్ కుమార్ 75 ఏళ్లు దాటడం, కేంద్ర రాజకీయాల్లో ఏదైనా కీలక పాత్ర పోషించాలనే ఆలోచనలో ఉండటం వల్ల ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు, ఆయన కుమారుడు నిశాంత్ కుమార్ కూడా రాజకీయాల్లోకి రాబోతున్నారనే వార్తలు జెడియు శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి. వారసత్వ ప్రణాళికలో భాగంగానే ఈ మార్పులు జరుగుతున్నాయని పార్టీ వర్గాలు అంతర్గతంగా చర్చించుకుంటున్నాయి. నితీష్ కుమార్ ఢిల్లీకి వెళ్తారా లేదా అనే అంశంపై ఇంకా అధికారిక ప్రకటన

2లో..

## రేవంత్ 99 రోజుల యాక్షన్ ప్లాన్..

# సంకల్పమా.? సవాలా.?

### - పాలనలో వేగం పెంచాలన్న సీఎం రేవంత్ లక్ష్యం ఎంతవరకు సాధ్యం.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో మార్పు శబ్దం వినిపించిన నాటి నుంచి వేగమే తన పాలనకు గుర్తు కావాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఎన్నికల హామీల అమలుకు గడువు కట్టిన "99 రోజుల యాక్షన్ ప్లాన్" ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది. మాట ఇచ్చిన వేగంతో పనులు పూర్తి చేయగలరా? లేక ఇది రాజకీయ ఉత్సాహానికి మాత్రమే పరిమితమవుతుందా? అన్న చర్చ తీవ్రంగా సాగుతోంది.

#### హామీల నుంచి కార్యాచరణ దాకా

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రధాన హామీల అమలుకు తొలి ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, 99 రోజుల గడువుతో స్పష్టమైన కార్యాచరణ రూపొందించినట్టు చెబుతోంది. మహిళలకు ఆర్థిక భరోసా, రైతులకు మద్దతు, యువతకు ఉద్యోగ అవకాశాలు, ధరల నియంత్రణ --- ఇవన్నీ ప్రాధాన్య అంశాలుగా ఉన్నాయి. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, శాఖల వారీగా టైమ్లైన్లు ఖరారు చేసి, ఫైళ్ల కదలికపై నేరుగా ముఖ్యమంత్రి

2లో..



## ఐఏఎస్, ఐపీఎస్లను

# బెదిరిస్తున్నారు

### - ముఖ్యమంత్రిపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్లను బెదిరిస్తున్నారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కలెక్టర్ల సదస్సులో ఆయన బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,

2లో..

## 20 నెలల్లో 6.28 లక్షల

# ఉద్యోగాలు కల్పించాం

### - అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రసంగం

- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం
- ఏపీకి క్యూ కడుతున్న ప్రపంచ స్థాయి సంస్థలు
- గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం
- పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పిస్తూ నిర్ణయం

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 20 నెలల కాలంలో సాధించిన ప్రగతిని, భవిష్యత్ కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభ వేదికగా వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ, ఉద్యోగ కల్పన, వైద్య, విద్య తదితర కీలక రంగాలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. కేవలం 20 నెలల్లోనే రాష్ట్రంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు

2లో..



## వర్సిటీలను బంధుగణంతో నింపేసి భ్రష్టుపట్టించారు

- ప్రభుత్వ బడిలోని విద్యార్థిని సొంత బిడ్డలా భావించాలన్న నారా లోకేశ్
- జీవో 117తో గత పాలకులు విద్యావ్యవస్థను కుప్పకూల్చారని ఆగ్రహం
- యూనివర్సిటీల వీసీలుగా బంధువులు, అర్హత లేనివారేనని ఆరోపణలు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపేలా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను ప్రపంచానికి చాటుదామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. శాసనసభలో విద్యాశాఖ బడ్జెట్ డిమాండ్ల ప్రతిపాదనల సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విద్యారంగంలో జరిగిన విధ్వంసం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను సవివరంగా

2లో..

## కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులుగా సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

### -మాట నెగ్గించుకున్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలకు సంబంధించి ఉత్కంఠకు తెరపడింది. హస్తం పార్టీ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో పాటు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డి పేర్లను కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. దేశవ్యాప్త రాజకీయ

2లో..



## హైదరాబాద్లో కల్తీ నెయ్యి కలకలం

- భారీగా కల్తీ నెయ్యి తయారీ
- హోటళ్లు, ఫంక్షన్లకు విక్రయం
- రూ.18.26 లక్షల విలువైన 460 కిలోలు సీజ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ బంజారాహిల్స్లో కల్తీ నెయ్యి వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. మాసబ్ ట్యాంక్ పోలీసులతో కలిసి గోల్కొండ టాస్క్ఫోర్స్ అధికారులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో భారీ కల్తీ నెయ్యి ముఠా ఆటకట్టించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 భోలానగర్లో

2లో..



## అసెంబ్లీలో సమూల మార్పులు

### - కొత్త కౌన్సిల్ హాల్, తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ

2లో..



## అమిత్ షాతో

# రేవంత్ రెడ్డి భేటీ

### - మావోయిస్టుల లొంగుబాటుపై చర్చలు

2లో..



## తెలంగాణలో జనాభా లెక్కల సేకరణ

### - మే 11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల వివరాల సేకరణ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేంద్రం దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన జనగణన ప్రక్రియలో భాగంగా.. తెలంగాణలో మొదటి దశ పనులను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు రేవంత్ ప్రభుత్వం రెడీ అవుతోంది. మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రంలోని ప్రతి ఇల్లు, కట్టడాల వివరాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తాజాగా అధికారులను ఆదేశించారు. మంగళవారం (మార్చి 3) సెక్రటేరియట్లో అన్ని శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన కీలక

2లో..

# 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించాం

కల్పించామని సీఎం అధికారికంగా ప్రకటించారు.

### ఉద్యోగాల కల్పనలో దూకుడు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని చంద్రబాబు తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగంలో 2.48 లక్షలు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 1.46 లక్షలు, వివిధ పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని గణాంకాలతో సహా వివరించారు. అలాగే మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్, ఇతర ప్రభుత్వ విభాగాల్లో కలిపి 30,500 ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చామని, అంతకంటే ఎక్కువ ఉద్యోగాలను కల్పించి మాట నిలబెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని కూడా నియమించినట్లు వెల్లడించారు.

### మళ్లీ వెలుగులోకి ఏపీ బ్రాండ్

గత ప్రభుత్వ పాలనపై విరుచుకుపడ్డ సీఎం, 2019-24 మధ్య కాలంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో జాకీ, అమర్ రాజా, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని గుర్తు చేశారు. ఆ సమయంలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల వల్ల 913 కంపెనీలు మూతపడ్డాయని ఆర్బీఐ నివేదికే స్వయంగా వెల్లడించిందని సభ దృష్టికి తెచ్చారు. గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు చిరునామాగా ఉన్న ఏపీని, ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా మారుస్తున్నామని చెప్పారు. కేవలం 26 కొత్త పాలసీలతో వేగంగా అనుమతులు ఇస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని తెలిపారు. ఇటీవల విశాఖలో జరిగిన సదస్సులో ఏకంగా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా భవిష్యత్తులో 16 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు.

### రాష్ట్రానికి అంతర్జాతీయ సంస్థలు

ఎన్డీఏ కూటమి పాలనపై నమ్మకంతో ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీకి క్యూ కడుతున్నాయని చంద్రబాబు తెలిపారు. గూగుల్, టాటా-టీసీఎస్ వంటి దిగ్గజాలు విశాఖకు వచ్చాయని, త్వరలోనే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్లకు శంకుస్థాపన చేయబోతున్నామని ప్రకటించారు. అలాగే ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్, టాటా సంస్థ ద్వారా రూ.6 వేల కోట్ల పెట్టుబడితో మరో యూనిట్ రాబోతోందని చెప్పారు.

పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం ఉద్ఘాటించారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ ఎకోసిస్టమ్, విశాఖలో ఐటీ హబ్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువత నైపుణ్యాలకు పదును పెడుతున్నామని అన్నారు.

### వైద్యం - పర్యాటకం

రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని, పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. పీపీపీ అంటే ప్రైవేట్ పరం కాదని, అది ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుందని స్పష్టత ఇచ్చారు. గత పాలకులు మెడికల్ కాలేజీలకు కనీసం భూమిని కూడా చూపించలేకపోయారని విమర్శించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. ఇక పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించామని, సూర్యలంక, గండికోట వంటి ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

### ఎక్సైజ్ ప్రక్షాళన

గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో అతిపెద్ద కుంభకోణం జరిగిందని, నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని సీఎం మండిపడ్డారు.

దీనిపై కేబినెట్ సబ్ కమిటీ విచారణ జరుపుతోందని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం పారదర్శక విధానంతో అంతర్జాతీయ బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. విద్యా రంగంలోనూ తెలుగు భాషను కాపాడుకుంటూనే, ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# రేవంత్ 99 రోజుల యాక్షన్ ప్లాన్.. సంకల్పమా.? సవాలా.?

కార్యాలయం పర్యవేక్షణ ఉంటుందని తెలుస్తోంది. "ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే లక్ష్యం" అని అధికార వర్గాలు చెబుతున్నాయి.

### ఆర్థిక గణితం --- లెక్కలు సరిపోతాయా?

అయితే, సంక్షేమ పథకాల అమలు వెనుక భారీ ఆర్థిక భారం ఉందన్నది వాస్తవం. రాష్ట్ర ఆదాయాలు, అప్పుల పరిమితులు, కేంద్ర నిధుల ప్రవాహం --- ఇవన్నీ కీలకంగా మారనున్నాయి. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం, తక్షణ ఫలితాల కోసం భారీ ఖర్చు చేస్తే దీర్ఘకాలిక అభివృద్ధి ప్రాజెక్టులపై ఒత్తిడి పడే అవకాశం ఉంది. కాబట్టి ఖర్చు-లాభ సమతౌల్యం పాటించాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.

### పరిపాలనా యంత్రాంగం --- సిద్ధమా?

99 రోజుల్లో లక్ష్యాలు సాధించాలంటే ఫైల్ కదలికలు వేగంగా సాగాలి. జిల్లా స్థాయిలో అధికారులు, శాఖల మధ్య సమన్వయం కీలకం. గతంలో అనేక ప్రభుత్వాలు వేగవంతమైన ప్రణాళికలు ప్రకటించినా, అమలులో ఆలస్యాలు కనిపించిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి తరచూ సమీక్షలు నిర్వహిస్తూ, శాఖల పనితీరుపై నేరుగా మానిటరింగ్ చేస్తున్నట్టు సమాచారం. అధికారులపై బాధ్యత నిశ్చితంగా పెట్టడం ద్వారా ఫలితాలు సాధించాలనే ప్రయత్నం కనిపిస్తోంది.

### రాజకీయ కోణం --- నమ్మకం సాధించే ప్రయత్నమా?

99 రోజుల గడువు రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. తక్షణ ఫలితాలు చూపించడం ద్వారా ప్రజల్లో నమ్మకం పెంచాలన్న వ్యూహం ఇందులో ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిపక్షాల విమర్శలకు సమాధానంగా పనితీరు చూపాలన్న ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది.

### ప్రజల అంచనాలు --- ఫలితం ఎప్పుడు?

**ప్రజల దృష్టిలో ఫలితం అంటే:**

- బ్యాంకు ఖాతాల్లో జమయ్యే సాయం
- రైతు ఖర్చులకు ఉపశమనం
- యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు
- ధరల నియంత్రణలో స్పష్టమైన మార్పు

ఇవి ప్రత్యక్షంగా కనిపిస్తేనే యాక్షన్ ప్లాన్ విజయవంతమైందని ప్రజలు భావించే అవకాశం ఉంది.

### నిపుణుల విశ్లేషణ

పాలనా నిపుణుల అభిప్రాయం ప్రకారం, "99 రోజుల్లో అన్ని సమస్యలకు పరిష్కారం చూపడం కష్టం. కానీ, పాలనలో దిశ, వేగం, పారదర్శకత కనిపిస్తే అది విజయానికి సూచిక." అంటే, పూర్తి అమలు కాకపోయినా స్పష్టమైన పురోగతి ఉంటే ప్రభుత్వం తన లక్ష్యాన్ని చేరుకున్నట్టే.

### అమలవుతుందా.? విమర్శలకే కారణమవుతుందా.?

99 రోజుల యాక్షన్ ప్లాన్ ఒక పెద్ద రాజకీయ మరియు పరిపాలనా పరీక్షగా మారింది. ఆర్థిక వనరులు, పరిపాలనా సమన్వయం, రాజకీయ సంకల్పం --- ఈ మూడు స్తంభాలపై ఈ ప్రణాళిక విజయాపజయాలు ఆధారపడనున్నాయి. మొత్తానికి, ఇది కేవలం గడువు కాదు --- ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టే కాలపరిమితి. రాబోయే రోజుల్లో ఈ యాక్షన్ ప్లాన్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది అవుతుందా? లేక విమర్శలకే కారణమవుతుందా? అన్నది సమయం తేల్చనుంది.

# వర్సిటీలను బంధుగణంతో నింపేసి భ్రష్టుపట్టించారు

వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరూ ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని, వాటి బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

### గత పాలనలో విధ్వంసం - విద్యావ్యవస్థ కుదేలు

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని లోకేశ్ తీవ్ర విమర్శలు చేశారు. అనాలోచితంగా తీసుకొచ్చిన జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు తీవ్రంగా నష్టపోయాయని, వ్యవస్థ మొత్తం కుప్పకూలిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో ఏకంగా 10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని గణాంకాలతో సహా వివరించారు. డ్రాప్ బాక్సుల విధానాన్ని దుర్వినియోగం చేసి, సుమారు 3 లక్షల మంది పిల్లల పేర్లతో మధ్యాహ్న భోజనం, కిట్ల నిధులను డ్రా చేసుకున్నారని ఆరోపించారు. కేవలం నంబర్లను మేనేజ్ చేయడానికే గత పాలకులు పరిమితమయ్యారని మండిపడ్డారు.

### అధఃపాతాళానికి పడిపోయిన ప్రమాణాలు

గత ప్రభుత్వ చర్యల వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) దారుణంగా పడిపోయాయని మంత్రి తెలిపారు. 2018లో 5వ తరగతి పిల్లలు గ్రేడ్-2 తెలుగును 57 శాతం మంది అర్థం చేసుకోగలిగితే, గత ప్రభుత్వంలో అది 37 శాతానికి పడిపోయిందన్నారు. నేషనల్ ఎచీవ్ మెంట్ సర్వేలో 3వ తరగతి లాంగ్వేజ్ విభాగంలో ఏపీ 1వ ర్యాంకు నుంచి 27వ ర్యాంకుకు, మ్యాథ్స్ లో 5వ ర్యాంకు నుంచి 21వ ర్యాంకుకు పడిపోవడం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద కాపలాకు పెట్టి అవమానించారని, ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### యూనివర్సిటీల్లో బంధుగణం - అక్రమ నియామకాలు

విశ్వవిద్యాలయాలను గత ప్రభుత్వం రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చిందని మంత్రి ధ్వజమెత్తారు. వర్సిటీల్లో ఫ్యాకల్టీ నియామకాలను గాలికొదిలేసి, వీసీలుగా బంధువులను, అర్హత లేనివారిని నియమించి భ్రష్టుపట్టించారని విమర్శించారు. ఏయూ వీసీగా ప్రసాదరెడ్డిని నియమించి విద్యార్థులను రోడ్లపై నిలబెట్టారని, అర్హత లేకపోయినా మాజీ సీఎం బంధువు సుందరవల్లిని ఎస్వీయూ రెక్టార్ గా, విక్రమ సింహపురి వర్సిటీ వీసీగా నియమించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి వంటి బంధువర్గానికి పదవులు కట్టబెట్టారని పేర్లతో సహా బయటపెట్టారు. వర్సిటీల్లో విగ్రహాలు పెట్టి, ఫ్లెక్సీలు కట్టి పవిత్రతను దెబ్బతీశారన్నారు. అంతేకాకుండా రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టి వెళ్లిపోయారని తెలిపారు.

### సంస్కరణల బాటలో ప్రజాప్రభుత్వం

కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖలో ప్రక్షాళన మొదలైందని లోకేశ్ తెలిపారు. జీవో 117 రద్దు చేసి, సింగిల్ టీచర్ విధానానికి స్వస్తి పలికామన్నారు. కేవలం 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల పోస్టుల భర్తీ చేపట్టామని గుర్తుచేశారు. మరోవైపు యూనివర్సిటీల్లోని న్యాయపరమైన చిక్కులను 90 రోజుల్లో తొలగించి, త్వరలోనే అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించారు. స్కూల్ కిట్స్, చిక్కీ, గుడ్ల సరఫరాలో అవినీతిని అరికట్టి రూ.1,000 కోట్లు ఆదా చేస్తున్నామని, ఈ నిధులను విద్యార్థుల సంక్షేమమేకే వెచ్చిస్తామని స్పష్టం చేశారు.

### ఎమ్మెల్యేలకు పిలుపు - టెక్నాలజీ వినియోగం

ప్రతి ఎమ్మెల్యే తమ పరిధిలోని రెండు పాఠశాలలను దత్తత తీసుకోవాలని, ప్రతి వారం స్కూళ్లను సందర్శించి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని మంత్రి కోరారు.

పిల్లల్లో 'పాసివ్ లెర్నింగ్' నుంచి 'యాక్టివ్ లెర్నింగ్' వైపు మార్పు తెచ్చేందుకు 'క్లిక్కర్ టెక్నాలజీ'ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. అమరావతిలో ప్రపంచస్థాయి సెంట్రల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం శోభా రియాలిటీ సంస్థ రూ.100 కోట్లు విరాళం అందించిందని సభకు తెలిపారు. చాగంటి కోటేశ్వరరావు గారి సలహాలతో పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని, అందరం కలిసి ఏపీని విద్యాహబ్‌గా మారుద్దామని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

## అసెంబ్లీలో సమూల మార్పులు

**- కొత్త కౌన్సిల్ హాల్, తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ శాసనసభ మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. అసెంబ్లీ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కీలక మార్పులను తీసుకురానుంది. దీనిలో భాగంగా మార్చి 8వ తేదీన కొత్తగా నిర్మించిన కౌన్సిల్ హాల్‌ను ప్రారంభించనున్నారు. కౌన్సిల్ హాల్ ప్రారంభించే అదే రోజున అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఆవిష్కరించనున్నారు. తెలంగాణ రాష్ట్ర అస్తిత్వానికి, గౌరవానికి ప్రతీకగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. వీటితోపాటు అసెంబ్లీలో కొత్తగా ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఛాంబర్, శాసనమండలి ఛైర్మన్ ఛాంబర్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం అదే రోజున ప్రారంభోత్సవం చేయనున్నారు.

ఇక ఈ కొత్త నిర్మాణాలకు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు ఇప్పటికే చివరి దశకు చేరుకున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం.. ఈసారి జరగనున్న తెలంగాణ బడ్జెట్ సమావేశాలను ఒకే ప్రాంగణంలోని అసెంబ్లీ, కొత్త కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఒకే ప్రాంగణంలో అటు అసెంబ్లీ, ఇటు మండలి కార్యకలాపాలు జరగడం వల్ల పాలనపరంగా పనులు మరింత సులభం కానున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇక తెలంగాణ బడ్జెట్ సమావేశాలు మార్చి 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇక మార్చి 20న రంజాన్ పండగ రోజున సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. మార్చి 16న గవర్నర్ ప్రసంగం.. మార్చి 17, 18ల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. 2026-2027 ఆర్థిక ఏడాదికి సంబంధించిన బడ్జెట్‌ను మార్చి 20న తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభ ముందుకు తీసుకురానున్నారు.

## తెలంగాణలో జనాభా లెక్కల సేకరణ

మార్గదర్శకాలను విడుదల చేశారు. జనాభా లెక్కల విభాగం రాష్ట్ర సంచాలకురాలు భారతీ హోళికెరితో కలిసి ఆయన ఇళ్ల లెక్కింపు ప్రక్రియపై సుదీర్ఘంగా చర్చించారు. ఇక ఈసారి జనాభా లెక్కల సేకరణలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోబోతోంది. దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఈ ప్రక్రియను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో కొనసాగించనున్నారు. క్షేత్రస్థాయిలో డేటా సేకరించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ అప్లికేషన్‌ను సైతం వినియోగించనున్నారు.

జనభాను లెక్కించే సిబ్బంది నేరుగా తమ స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా వివరాలను నమోదు చేస్తారు. దీనివల్ల సమాచారం అత్యంత వేగంగా, కచ్చితత్వంతో కేంద్రీకృత వ్యవస్థకు చేరుతుంది. ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా, పౌరులు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునే సెల్ఫ్-ఎన్యూమరేషన్ సౌకర్యాన్ని సైతం సర్కార్ ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మే 11కి 15 రోజుల ముందే ప్రారంభమవుతుందని సీఎస్ కె. రామకృష్ణారావు వెల్లడించారు.క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదని కలెక్టర్లను సీఎస్ హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం భౌగోళిక సరిహద్దులను పక్కాగా నిర్ధారించుకోవాలన్నారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ఇల్లు, నివాసం, మారుమూల కుగ్రామం లేదా పట్టణ మురికివాడను కూడా ఈ జాబితా నుంచి మినహాయించకూడదన్నారు. ప్రతి కట్టడం వివరాలు తప్పనిసరిగా రికార్డుల్లోకి ఎక్కాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ భారీ కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు ముందస్తుగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరి బాధ్యతలను రాష్ట్ర సంచాలకురాలు భారతీ హోళికెరి వివరించారు. డేటా సేకరణ కోసం రూపొందించిన మొబైల్ యాప్‌ల పనితీరు, బ్యాకెండ్ పర్యవేక్షణ విధానాలు, డేటా భద్రతకు సంబంధించి అనుసరిస్తున్న అధునాతన డిజిటల్ వ్యవస్థల గురించి ఆమె ప్రజెంటేషన్ ఇచ్చారు. సాంకేతికతను జోడించడం ద్వారా జనాభా లెక్కల సేకరణలో పారదర్శకత పెరుగుతుందని భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు ఇది ఎంతగానో దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు.

### తెలంగాణలో సీపీఎం గతమెంతో ఘనం

# ఇప్పుడు నిర్వీర్యం

సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల కేడర్ కూడా ఇతర పార్టీల వైపు మళ్ళింది. ముఖ్యంగా యువతను ఆకర్షించడంలో సీపీఎం విఫలమైంది. నేటితరం రాజకీయాల్లో మారుతున్న సోషల్ మీడియా సమీకరణాలను, ఆధునిక ప్రచార పద్ధతులను అందిపుచ్చుకోవడంలో పాతకాలపు పద్ధతులే ఆ పార్టీని దెబ్బతీశాయి.

### తెలంగాణలో కోలుకోవడం అసాధ్యమేనా.?

ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వంటి బలమైన శక్తుల మధ్య సీపీఎం వంటి పార్టీలు మనుగడ సాగించడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది. పార్టీ అంతర్గతంగా చీలిపోయి ఉండటం, నాయకత్వంపై నమ్మకం సడలడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం కుప్పకూలింది. పార్టీ కార్యకర్తలు కూడా ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ రక్షణ లేకపోవడంతో ఇతర పార్టీల్లో చేరుతున్నారు. ఈ దశలో పార్టీని మళ్లీ గాడిలో పెట్టే శక్తివంతమైన నాయకత్వం ప్రస్తుతం ఆ పార్టీలో కనిపించడం లేదు. సీపీఎం తెలంగాణలో కోలుకోవడం ఇక దాదాపు అసాధ్యమనే అనిపిస్తోంది. కేవలం గతకాలపు వైభవాన్ని నెమరువేసుకోవడం తప్ప, భవిష్యత్తుపై స్పష్టమైన ప్రణాళికలు ఆ పార్టీ దగ్గర లేవు. తమ్మినేని వంటి సీనియర్ నేతలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా పార్టీని ప్రక్షాళన చేయాలనుకున్నా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన ఏ రాజకీయ పార్టీ అయినా మళ్లీ పుంజుకోవడం చరిత్రలో చాలా అరుదు. ప్రస్తుత పరిస్థితుల్లో సీపీఎం తెలంగాణలో ఒక నామమాత్రపు శక్తిగా మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

## బీహార్ రాజకీయాల్లో పెను మార్పులు

వెలువడాల్సి ఉంది. కానీ, ఒకవేళ అదే జరిగితే బీహార్‌లో సుదీర్ఘకాలం సాగిన నితీష్ యుగం ముగిసి, తొలిసారిగా బిజెపి తన సొంత ముఖ్యమంత్రిని పీఠంపై కూర్చోబెట్టే అవకాశం దక్కుతుంది. అయితే అలాంటి చర్చ జరగడం లేదని ఎన్డీఏ మిత్రపక్ష నేత చిరాగ్ పాశ్వాన్ అంటున్నారు. ఈ పరిణామం రాబోయే రోజుల్లో బీహార్ రాజకీయాల్లో ఎలాంటి అలజడి సృష్టిస్తుందో వేచి చూడాలి.

## ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు

ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. రెండున్నరేళ్లలోనే ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను బదిలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోందని అన్నారు. పరిస్థితులను అర్థంచేసుకునే లోపే అధికారులను బదిలీ చేస్తున్నారని విమర్శించారు. జీహెచ్ఎంసీ కమిషనర్లు కూడా రెండున్నరేళ్లలో నలుగురు మారారని తెలిపారు. ముఖ్యమంత్రి లేదా మంత్రులకు నచ్చకపోతే ఆ అధికారులను వెంటనే బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. కొందరికి పోస్టింగులు ఇచ్చి జాయిన్ చేసుకోవడం లేదని విమర్శించారు. త్వరలో కాంగ్రెస్ నేతల అవినీతిని, బినామీలను బయటపెడతామని హెచ్చరించారు.

### కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులుగా

# సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

సమీకరణలు, రాష్ట్ర రాజకీయ అవసరాల మధ్య సమతుల్యత పాటిస్తూ ఈ ఇద్దరినీ ఎంపిక చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**సింఘ్వీకి మరో అవకాశం** గతంలో ఉప ఎన్నిక ద్వారా తెలంగాణ నుంచి పెద్దల సభకు ఎన్నికైన అభిషేక్ మను సింఘ్వీ పదవీ కాలం ముగియనుంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి కీలక న్యాయవాదిగా, ట్రబుల్ షూటర్‌గా ఉన్న ఆయన సేవలను దృష్టిలో ఉంచుకుని పార్టీ మళ్ళీ ఆయనకే మొగ్గు చూపింది. రాష్ట్ర నాయకత్వం కూడా సింఘ్వీ అభ్యర్థిత్వాన్ని బలపరిచినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా పార్లమెంట్‌లో పార్టీ వాణిని బలంగా వినిపించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు.

**రేవంత్ నమ్మకస్తుడు 'వేం'కు దక్కిన గుర్తింపు** ఇక రెండో అభ్యర్థిగా ఎంపికైన వేం నరేందర్ రెడ్డి పేరు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ముఖ్యమంత్రికి రాజకీయ సలహాదారుగా ఉన్న ఆయన, రేవంత్ రెడ్డి కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన వ్యక్తి. పార్టీ కోసం, ప్రభుత్వం కోసం తెరవెనుక ఉండి చక్రం తిప్పుతున్న నరేందర్ రెడ్డికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం రేవంత్ గట్టిగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది. పార్టీ పట్ల ఆయనకున్న విధేయత, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచే రెడ్డి వర్గానికి పెద్దగా ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తి ఉందని.. ఇటీవల భర్తీ చేసిన పదవులన్నీ ఇతర వర్గాలకే ఇస్తున్నామని ఈ సారి.. రెడ్డి వర్గానికిచాన్స్ ఇవ్వాలన్న వాదన రేవంత్ గట్టిగా వినిపించారు. వేం నరేందర్ రెడ్డికి కాకపోతే ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఇవ్వాలని అనుకున్నారు. అయితే ఆయన ఆసక్తి చూపించలేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**విధేయతకు పట్టం** ఈ ఇద్దరి ఎంపిక ద్వారా కాంగ్రెస్ అటు జాతీయ అవసరాలను, ఇటు స్థానిక సమీకరణలను మేళవించింది. సింఘ్వీ ద్వారా ఢిల్లీ స్థాయిలో పార్టీకి బలం చేకూరుతుండగా, వేం నరేందర్ రెడ్డి ఎంపిక ద్వారా రెడ్డి సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించినట్లయింది. శాసనసభలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న స్పష్టమైన మెజారిటీ దృష్ట్యా, ఈ ఇద్దరు అభ్యర్థుల ఎన్నిక దాదాపు లాంఛనమే కానుంది. ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ తమ అభ్యర్థులను నిలబెట్టే అవకాశం తక్కువగా ఉండటంతో, వీరిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం మెండుగా ఉంది. దీంతో తెలంగాణ నుంచి పెద్దల సభకు కాంగ్రెస్ ప్రాతినిధ్యం మరింత బలోపేతం కానుంది.

## హైదరాబాద్‌లో కల్తీ నెయ్యి కలకలం

ఫ్రైడ్ డెయిరీ పేరుతో కల్తీ నెయ్యి తయారు చేస్తున్న కేంద్రంపై ఆకస్మిక దాడులు చేశారు. ఇందులో భారీగా కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్లు గుర్తించి దాన్ని మొత్తం స్వాధీనం చేసుకున్నారు. కల్తీ నెయ్యితోపాటు దాన్ని తయారు చేసేందుకు ఉపయోగించే వస్తువులు, ముడి పదార్థాలు కూడా సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కల్తీలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఈ క్రమంలోనే ఈ కల్తీ నెయ్యి నిందితుడు మహ్మద్ జునైద్ అని గుర్తించిన పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు అతడిని అరెస్ట్ చేశారు. ఆ కల్తీ నెయ్యి తయారు కేంద్రం నుంచి రూ.18.26 లక్షల విలువ గల 460 కిలోల కల్తీ నెయ్యి ఇతర సామగ్రిని సీజ్ చేశారు. మహ్మద్ జునైద్ కల్తీ నెయ్యి తయారు చేసి దాన్ని హైదరాబాద్ మహా నగరంలోని పలు హోటళ్లు, శుభకార్యాలు, ఫంక్షన్లకు అమ్ముతున్నట్లు అధికారుల దర్యాప్తులో గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మాసబ్ ట్యాంక్ పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు.నిందితుడు మహ్మద్ జునైద్ హుస్సేన్ వయసు 26 ఏళ్లు అని అతడి తండ్రి మహ్మద్ మౌజం హుస్సేన్ అని తెలిపారు. భోలా నగర్‌లోనే అతడు నివసిస్తూ ఫ్రైడ్ డెయిరీ పేరుతో ఈ కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో 70 కిలోల కల్తీ మిశ్రమ నెయ్యితో పాటు భారీ స్థాయిలో కల్తీకి ఉపయోగించే ముడి పదార్థాలను సీజ్ చేశారు. 2,090 కిలోల ఆవు మీగడ, 1,170 కిలోల గేదె మీగడను అధికారులు పట్టుకున్నారు. నెయ్యిని కల్తీ చేసేందుకు ఉపయోగిస్తున్న 28 డబ్బాల రుచి గోల్డ్ డాల్డా ఇతర ఖాళీ డబ్బాలు, వాడేసిన ఆయిల్ ప్యాకెట్లను కూడా పోలీసులు సీజ్ చేశారు. కల్తీ నెయ్యి తయారీకి ఉపయోగిస్తున్న 2 బాయిలర్లు, ఒక పుషింగ్ మిషన్, ఒక ప్యాకింగ్ మిషన్, రెండు వెయిట్ మిషన్లు, 4 గ్యాస్ సిలిండర్లు, నెయ్యి నిల్వ ఉంచిన సుమారు 70 రకాల చిన్న, పెద్ద బేసన్లు ఖాళీ డ్రమ్ములు, ప్యాకింగ్ కవర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహ్మద్ జునైద్ హుస్సేన్ తన ఫ్రైడ్ డెయిరీ యూనిట్‌లో లైసెన్స్ కలిగి ఉన్నప్పటికీ అక్రమ సంపాదన కోసం ఇలా కల్తీ నెయ్యి తయారు చేసి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్నాడని పోలీసులు వెల్లడించారు. తక్కువ నాణ్యత కలిగిన పామ్ ఆయిల్, డాల్డా, ఇతర హానికరమైన పదార్థాలను ఆవు, గేదె మీగడలో కలిపి ఈ కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నాడని తెలిపారు. ఇలా తయారు చేసిన కల్తీ నెయ్యిని అసలైన నెయ్యి అంటూ ప్రజలను నమ్మిస్తూ విక్రయిస్తున్నాడని పేర్కొన్నారు.

## అమిత్ షాతో రేవంత్ రెడ్డి భేటీ

న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీలో డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి పాల్గొన్నారు. మావోయిస్టుల లొంగుబాటు, ఆయా ప్రాంతాల్లోని పరిణామాలపై వారు చర్చించారు. ఈ నెల 31న జరగనున్న మావోయిస్టు రహిత భారత్ కాన్ఫరెన్స్ పై చర్చించారు. ఇటీవల కీలక మావోయిస్టు నేతలు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు.

లొంగిపోయిన మావోయిస్టు ముఖ్య నాయకులు సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో వివిధ అంశాలపై చర్చించారు. సచివాలయంలో లొంగిపోయిన వారితో జరిగిన చర్చను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. మావోయిస్టుల లొంగుబాట్లు మహారాష్ట్ర, తెలంగాణలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొన్నిరోజుల క్రితం దేవ్ జీ తదితర కీలక నాయకులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినప్పటికీ, కీలక మావోయిస్టు నాయకుడు గణపతి మాత్రం ఇప్పటి వరకు లొంగిపోలేదు.

### విద్యుత్ ఘాతానికి గురయిన విద్యార్థులను

# పరామర్శించిన మాజీ ఎంపి భరత్



**రాజమండ్రి** విద్యుత్ ఘతానికి గురి అయ్యి ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న ఇద్దరు స్కూలు విద్యార్థులను వైసిపి మాజీ ఎంపీ మార్గాని భరత్ పరామర్శించారు.భరత్ మాట్లాడుతూ రాజమండ్రి సిటీ, అనుశ్రీ థియేటర్ వద్ద గల ట్రైనింగ్ కాలేజీ ప్రాంగణంలో ఉన్న స్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు విద్యుత్ ఘాతానికి గురయ్యారని తెలిసిన వెంటనే పీత రామకృష్ణ బృందానికి తెలియచేసాను. వాళ్ళు వివరాలు సేకరించారు. ఇక్కడ దానవాయిపేట సురక్ష హాస్పిటల్ నందు 15 వ వార్డు కు చెందిన యన్ రమేష్, దివాన్ చెరువు కేశవ హాస్పిటల్ లో 27 వ వార్డు కు చెందిన ఉజ్వల ఈశ్వర సాయి చికిత్స పొందుతున్నారు.. స్కూల్ జరుగుతున్న సమయంలో ఇద్దరు పిల్లలు మామిడికాయలు కోయడానికి బయటకు వచ్చి అధ్యాపకులు తిడతారని గోడ దూకే క్రమంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ షాక్ కు గురి అయ్యి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు..విద్యా శాఖ అధికారులు వచ్చి తలొక పది వేల రూపాయలు వైద్య ఖర్చులకు ఇచ్చి వెళ్లిపోయారని బాధిత తల్లి తండ్రులు చెపుతున్నారని అన్నారు.జిల్లా విద్యాశాఖాధికారి తో మాట్లాడి ఈ పిల్లలకు ప్రభుత్వం తరపున వైద్య సహాయం అందించాలని లేకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు.. మొన్న కల్తీ పాల ఘటన, వేట్ల పాలెం బాంబు పేలుడు ఘటన, రెండు రోజుల క్రితం ఈ విద్యార్థుల ఘటన అసలు కూటమి ప్రభుత్వ ఏమి చేస్తుంది బాధితుల కష్టాలు పట్టవా కనీసం పట్టించుకోరా! వెంటనే స్పందించి ఈ విద్యార్థులకు అండగా ప్రభుత్వం నిలబడాలని డిమాండ్ చేసారు.

## ఉపాధ్యాయుడిపై 10వ తరగతి విద్యార్థుల దాడి

**ఎన్టీఆర్ జిల్లా** పదవ తరగతి విద్యార్దులు ఉపాధ్యాయుడిపై దాడికి దిగారు. ఘటన ఎన్టీఆర్ జిల్లా బాపులపాడు మండలం వీరవల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో జరిగింది. బాత్రూమ్ లో సిగరెట్లు తాగుతున్నారని నిలదీసినందుకు ఉపాధ్యాయుడిపై దాడి చేసినట్లు సమాచారం. ఉపాధ్యాయుడిపై పిడిగుద్దులు కురిపించిన వీడియో బయటపడింది.

# యూరియా కోసం రైతుల ధర్నా

**నాగర్ కర్నూల్** జిల్లాలో యూరియా కోసం రైతన్నలు రోడెక్కారు. వెల్దండ మండల కేంద్రంలో హైదరాబాద్ ? శ్రీశైలం జాతీయ రహదారిపై రైతులు ఆందోళనకు దిగారు. సొసైటీకి 700 బస్తాల యూరియా వచ్చినట్లు యాప్లో చూపించి, 2-3 సెకండ్లలోనే స్టాక్ అయిపోయిందంటూ ఆవేదన వ్యక్తం చేసారు. స్మార్ట్ ఫోన్లు లేని వారికి, యాప్ వాడటం రాని వారికి యూరియా ఎలా ఇస్తారంటూ మండిపడ్డారు. యూరియా యాప్ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగా పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేసారు.

# యంగ్ ఇండియా స్కూల్స్లో భారీ అవినీతి

**హైదరాబాద్** యంగ్ ఇండియా స్కూల్స్లో జరిగిన అవినీతి అంత ఇంత కాదు. అన్ని ఆధారాలు ఉన్నాయి, త్వరలో అన్ని బయట పెడుతానని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఎవరికి ఎక్కువ టెండర్లు ఇచ్చారు.. అన్ని ఆధారాలు ఉన్నాయి. పరిపాలనలో ముఖ్యమంత్రికి పట్టు రావడం లేదు. ప్రతిపక్షంగా మేము సక్సస్ అయ్యాం. ఖమ్మంకు కేటీఆర్ వెళ్ళాడు ఇప్పుడు స్థలాలు ఇస్తాం అన్నారు ఇండ్లు కట్టిస్తాం అన్నారు. నేను శారదా పీఠం వెళ్ళాను అది ఆపుతున్నాం అన్నారు. దేవాదుల ప్రాజెక్టు వెళ్ళాం వెంటనే ముఖ్యమంత్రి వెళ్ళాడు. హెల్త్ సిటీకి వెళ్ళాం, ప్రతి దానికి మేము వెళ్ళాక స్పందిస్తున్నారు. జర్నలిస్టుల హెల్త్ స్కీంను గాలికి వదిలేశారు. మేము ఉన్నప్పుడు ప్రత్యేక జీవో ఇచ్చాం. ఉద్యోగులకు ఎలా ఉండేదో అలానే జర్నలిస్టులకు ఉండేదని అన్నారు. రేవంత్ రెడ్డి మేనల్లుడి మనుషులు నియో పోలీస్లో అక్రమ మైనింగ్ చేస్తున్నారు. మొబైల్ క్రషింగ్ ప్లాంట్కు మాత్రమే నిబంధనలుండగా ఫిక్స్ క్రషింగ్ ప్లాంట్ నియోపోలీస్లో పెట్టారు. ల్యాండ్ లీజుకు ఇస్తే 6 నుంచి 7 శాతం ఫీజు కట్టాలి. లెటర్లో పది ఎకరాలు ఇస్తే 15 ఎకరాల్లో మైనింగ్ జరుగుతోంది. 15 లక్షల క్యూబిక్ మీటర్ల బండకు ఫీజు ఎగ్గొట్టారు. అక్కడ రెడీమిక్స్కు పర్మిషన్ లేదని అయన అన్నారు.

### ద్విచక్ర వాహనదారులకు

# హెల్మెట్టే శ్రీరామ రక్ష

**- జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున**



**తుగ్గలి:** ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ను ధరించాలని,హెల్మెట్టే వారికి మరియు వారి కుటుంబానికి శ్రీరామరక్ష అని జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తెలియజేశారు.బుధవారం రోజున జొన్నగిరి గ్రామంలో మంత్రాలయం ? బెంగళూరు ప్రధాన రహదారిపై వాహనదారులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్.ఐ మల్లికార్జున మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు అతివేగంతో వాహనాలను నడపరాదని,తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వకూడదని తెలియజేశారు.ఆటో డ్రైవర్లు కూడా పరిమితిని మించి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించుకోరాదని ఎస్.ఐ తెలియజేశారు.కారులో ప్రయాణించేవారు తప్పక సీట్ బెల్ట్ ను ధరించాలని ఆయన తెలియజేశారు. వాహనదారులందరూ వాహనాలకు సంబంధించిన రికార్డులను తమ వద్ద ఉంచుకోవాలని తెలియజేశారు.ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధించబడతాయని వాహనదారులను ఎస్.ఐ మల్లికార్జున హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి పోలీసు అధికారులకు సహకరించి గమ్యస్థానాలను సురక్షితంగా చేరాలని జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జొన్నగిరి పోలీస్ సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్..

# 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ..!!

రేషన్ కార్డు లబ్ధిదారుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే వేసవి కాలం దృష్ట్యా ఒకేసారి మూడు నెలల సరిపడా రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది.ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఏప్రిల్ నెలలోనే పంపిణీ జరిగేలా చూడాలని రాష్ట్రాలకు కేంద్ర పౌర సరఫరాల శాఖ లేఖలు రాసింది. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే ఎండలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తీసుకుంది.

# విద్యుత్ మోటర్ వైర్ల దొంగల ముఠా అరెస్ట్.

**- రూ1.15 లక్షల నగదు 15 కేజీల రాగి స్వాధీనం.**



**రుద్రవరం** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ మరియు ఆళ్లగడ్డ ఎస్డిపిఓ ఆదేశాల మేరకు రుద్రవరం పోలీసులు దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వివిధ మండలాల్లో రైతుల బోర్ల వద్ద విద్యుత్ వైర్లను కట్ చేసి దొంగిలిస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాలో నలుగురిని అరెస్ట్ చేసినట్లు సిరివెళ్ల సీఐ డి. రాము వెల్లడించారు. గత కొంతకాలంగా రుద్రవరం, మహానంది, గోస్పాడు, సిరివెళ్ల, ఆళ్లగడ్డ, దొర్నిపాడు మరియు చాగలమర్రి మండలాల్లోని పొలాల్లో పంప్ సెట్ల వైర్లు దొంగతనానికి గురవుతున్నాయి. దీనివల్ల రైతులకు ఆర్థికంగానే కాకుండా, సాగు నీరు అందక పంట నష్టం కూడా వాటిల్లుతోంది. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో రుద్రవరం శివారులోని హెచ్.పి పెట్రోల్ బంక్ వద్ద నిందితులు ఉన్నారనే సమాచారంతో ఎస్ఐ జయప్ప, ఏఎస్ఐ భూపాల్ రెడ్డి మరియు వారి బృందం దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో సిరివెళ్ళకు చెందిన ఇండ్ల నరసింహులు, ఇండ్ల వెంకటేశ్వర్లు,ఇండ్ల రంగయ్య, అహోబిలం కు చెందిన యాట చిన్నయ్య ఉన్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి దాదాపు 15 కిలోల రాగి వైర్లు మరియు గతంలో దొంగిలించిన సొత్తును విక్రయించగా వచ్చిన రూ. 1,15,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ వైర్లను కొనుగోలు చేస్తున్న సిరివెళ్ల మరియు ఆళ్లగడ్డకు చెందిన గుజరీ షాపుల యజమానులైన షేక్ హుస్సేన్ బాషా, షేక్ మాలిక్ బాషా మరియు షేక్ ఖాదర్ బాషాలను కూడా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. దొంగలు పగలు పొలాల్లో తిరిగి ఎక్కడెక్కడ మోటార్లు ఉన్నాయో గమనిస్తారని, ఎవరైనా ప్రశ్నిస్తే "పిట్టల కోసం వచ్చాము" అని నమ్మిస్తారని సీఐ హెచ్చరించారు. రైతులు తమ పొలాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమర్థవంతంగా పనిచేసిన ఎస్ఐ జయప్ప మరియు ఇతర పోలీసు సిబ్బందిని ఉన్నత అధికారులు అభినందించినట్లు తెలిపారు.

# మియాపూర్‌లో డ్రగ్స్ కలకలం!

**హైదరాబాద్** మియాపూర్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.పక్కా సమాచారంతో దాడులు నిర్వహించగా,ముగ్గురు సాఫ్ట్‌వేర్ యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో డ్రగ్ పెడ్లర్ హనుమంతుతో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న మహేష్,ఆదర్శ్‌లను అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి సుమారు 12.6 గ్రాముల ఎమ్‌డీఎమ్‌ఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ డ్రగ్ మార్కెట్ విలువ దాదాపు 1.5 లక్షల రూపాయలుగా అంచనా..దర్యాప్తులో ఈ ముఠా నైజీరియన్‌ల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి, బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు విక్రయిస్తున్నట్లు తేలింది కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు

## ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష

**సిద్దిపేట** ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల గురించి ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారుజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయా గ్రామంలో ఏంజీ ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన పనులు అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, సబ్ సెంటర్, గ్రామ మహిళా సమాఖ్య, ఫుడ్ గ్రైన్ స్టోరేజ్, సిసి రోడ్లు, ఆయా పాఠశాలలో ప్రహరీ గోడ, మరుగుదొడ్ల నిర్మాణాల పైన సమీక్షించారు. అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీ గోడ నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పనులు పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన ఈజీఎస్ పనులు పూర్తి చేసి ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ 15 రోజులు అత్యంత కీలకం అని ఆయా నిర్మాణాలు ఒక ప్రణాళిక ప్రకారం రోజు వారిగా ప్రోగ్రెస్ తీసుకురావాలని ఆయా స్థాయిలో నిర్మాణం పూర్తి కాగానే మాస్టర్ జెనరేట్ చేసుకుని అప్లోడ్ చెయ్యాలని తెలిపారు.ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం, మండలం, గ్రామం వారిగా ప్రారంభాలకు సిద్ధం చెయ్యాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, పంచాయతీరాజ్ ఈఈ చిరంజీవి, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

### షార్ట్ వీడియో పోటీల విజేతలకు

# వండర్లా ఉచిత కూపన్ల పంపిణీ

**- సీపీ రష్మీ పెరుమాళ్**



**సిద్దిపేట** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా వేదికగా నిర్వహించిన మొదటి విడత ఆన్‌లైన్ షార్ట్ వీడియోల పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు, సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ చేతుల మీదుగా బహుమతులు అందజేసిన విషయం తెలిసిందే.. విజేతలకు 1వ, 2వ మరియు 3వ బహుమతులతో పాటు, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. సిద్దిపేట పోలీసులు రూపొందించిన ఈ వినూత్న కార్యక్రమానికి ఆకర్షితులైన ప్రముఖ వినోద సంస్థ వండర్లా, విజేతలకు ఉచిత ప్రవేశ కూపన్లను స్పాన్సర్ చేసింది. సీపీ సమక్షంలో ఈ కూపన్లను విజేతలకు పంపిణీ చేయడం జరిగింది.షార్ట్ వీడియో కాంటెస్ట్ 2.0 ప్రారంభం:మొదటి విడతకు వచ్చిన అనూహ్య స్పందనతో, ఇప్పుడు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షార్ట్ వీడియో కాంటెస్ట్ 2.0 ను ప్రారంభించడం జరిగింది. సమాజంలో చైతన్యం నింపేందుకు యువత, కంటెంట్ క్రియేటర్లు మరియు ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ పోటీలో పాల్గొనాలని సీపీ పిలుపునిచ్చారు.పోటీ అంశాలు: సైబర్ నేరాలపై అవగాహన,మహిళల భద్రత మరియు వేధింపుల నిరోధం, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన, ఈవ్ టీజింగ్ నిరోధం మాదక ద్రవ్యాల నిర్మూలన,సామాజిక బాధ్యతతో కూడిన వీడియోలను రూపొందించి, సోషల్ మీడియాలో మా అధికారిక ఖాతాలను ట్యాగ్ చేయండి. ప్రతిభావంతులకు ఆకర్షణీయమైన బహుమతులు అందించబడతాయి.

## ముస్లిం సోదరులకు బిర్యానీ పొట్లాలు ఇచ్చిన 28 వ వార్డు కౌన్సిలర్ కోట్ల శిరీష రవి.



**వనపర్తి.** వనపర్తి జిల్లా కేంద్రం 28వ వార్డ్ వెంగళరావు కాలనీలో రంజాన్ మాసం సందర్భంగా వార్డు కౌన్సిలర్ కోట్ల శిరీష రవి ముస్లిం సోదరులకు బిర్యాని ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ నాయకులు అక్తర్ , మాజీ మైనారిటీ జిల్లా అధ్యక్షులు కమర్మియా అనీష్ , బాబా ఆర్టిఏ మెంబర్ జహంగీర్ , ఆసిఫ్ వసీం , ఇర్ఫాన్ యూత్ వార్డు అధ్యక్షుడు నిరంజన్ కార్తీక్ మరియు కాలనీవాసులు పాల్గొనడం జరిగింది.

# ముగిసిన హోళీ వేడుకలు.



**హోళగుంద** మండల కేంద్రంలో బుధవారం స్థానిక శ్రీ ఉరవకొండ మహస్వామి మఠం వద్ద హోళీ వేడుకలు ఘనంగా ముగిశాయి.గత 6 రోజుల పాటు యువకులు,పెద్దలు వివిధ హాస్య సన్నివేశాలను వేసి ప్రజలను కడుపుబ్బ నవ్వించారు. హోళీ వేడుకలు చివరి రోజుల్లో భాగంగా కామన్న శవం ఊరేగింపు,కామన్నకు మరల పునర్జన్మ రావడంతో పెళ్లి కొడుకు...పెళ్లి కూతురు ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.ఇందుల్లో భాగంగా యువకులు,పెద్దలు అనే తేడా లేకుండా ఆందోత్సవంలో రంగులు పూసుకుంటు కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించారు.అలాగే ఈ సందర్భంగా అక్కడి ప్రజలు మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మరియు వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బంజారాహిల్స్లో కల్తీ నెయ్యి పట్టివేత

బంజారాహిల్స్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కల్తీ నెయ్యి తయారీ కేంద్రాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి సీజ్ చేశారు. ఈ ఆపరేషన్లో ఫ్రైడ్ డెయిరీ యజమాని మొహమ్మద్ జునైద్ హుస్సేనను అరెస్ట్ చేశారు. రూ. 18.26 లక్షల విలువైన 530 కేజీల కల్తీ నెయ్యితో పాటు, తయారీకి ఉపయోగిస్తున్న మీగడను స్వాధీనం చేసుకున్నారు. కల్తీ నెయ్యి తయారీకి వినియోగిస్తున్న బాయిలర్లు, ప్యాకింగ్ మిషన్లను సీజ్ చేశారు.

# దర్శిలో కలెక్టర్ పర్యటన

**ఒంగోలు** ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ బి. రాజాబాబు పర్యటించారు.శివరాజ్నగర్ వద్ద నిర్మించిన నూతన క్రికెట్ గ్రౌండ్ ను ఆయన పరిశీలించారు.అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో కలసి ఆరాదీశారు.అధికారుల పనితీరుకు అద్దం పట్టేలా ప్రజలకు పరిపాలన అందించాలని,స్టేడియం ఏర్పాటుకు తమ వంతు కృషిని అందిస్తున్నామని తెలిపారు.

### ఐదోరోజూ ఇజ్రాయెల్,

# ఇరాన్ హోరాహోరీ దాడులు

**టెహ్రాన్:** ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త కూటమి మధ్య యుద్ధం ఐదోరోజైన బుధవారంనాడు మరింత తీవ్రమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ దాడులు జరుపుతోంది. ఇరాన్‌లోని ఉర్మియా, కెర్మాన్‌షా నగరాలకు కూడా దాడులను విస్తరించింది. తూర్పు టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌తో సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాక్ దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్ క్షిపణులు సౌదీలోని ఎంబసీని, దుబాయ్‌లోని యూఎస్ కాన్సలేట్‌ను ఢీకొట్టాయి. ఖతార్‌లోని అల్ ఉదేద్ ఎయిర్‌బేస్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడి జరిగింది.

## తాడేపల్లిగూడెం, తణుకు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో జనరల్ కేటగిరిలో మద్యం బార్లు లాటరీ పద్ధతి ద్వారా కేటాయింపు.



**భీమవరం:** జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియ భీమవరం కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం నందు బుధవారం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో ఒకటి, తణుకులో ఒకటి మొత్తం రెండు మద్యం బార్లను జనరల్ కేటగిరీలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసి కేటాయించడం జరిగింది. తాడేపల్లిగూడెం మద్యం బార్ కు లాటరీ పద్ధతి ద్వారా తాటికాయల వీరన్న ఎంపిక కాగా, రిజర్వ్ వన్ అండ్ టు అభ్యర్థులుగా జి.అయ్యప్ప, తిరుమల వెంకట నరసింహాచార్యులు ఎంపికకావడం జరిగింది. ఒకవేళ తాటికాయల వీరన్న నిర్ణీత ఫీజు చెల్లింపు చేయని పక్షంలో, వరుస క్రమంలో రిజర్వ్ అభ్యర్థులకు బార్లు కేటాయింపు జరుగుతుంది. తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక మద్యం బార్ కు ఎం.దానారావు ఒక్కొరే నాలుగు దరఖాస్తులు వేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారి ఆర్.వి ప్రసాద్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్లు కె.బలరామరాజు, కళ్యాణ్ చక్రవర్తి, రమేష్, మణికంఠ రెడ్డి, స్వరాజ్యలక్ష్మి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ విగ్రహాన్ని అవమానపరిచిన
# దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి
### కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు డిమాండ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మహాత్మా గాంధీ విగ్రహాన్ని అవమానపరిచిన దుండగులపై చర్య తీసుకోవాలని మెదక్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ పట్టణ ములో జరిగిన సంఘటన దురదృష్టకరమని ఆవేదన చెందారు. దేశ స్వాతంత్రంలో మహాత్మా గాంధీ అహింసా వాదంతో భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు ఆయన విగ్రహాన్ని అవమానపరచడం భారతజాతికి అవమానం మండిపడ్డారు. అహింస మార్గంతో స్వాతంత్రం తీసుకువచ్చారని పోరాడిన గాంధీజీని అవమానపరిచిన గూండాలను తక్షణమే అరెస్టు చేయాలని, డిమాండ్ చేశారు. వారికి కఠిన శిక్ష విధించాలని మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ అని అన్నారు. ఇలాంటి సంఘటనలు మరొకరి జరగకుండా పోలీస్ శాఖ చూడాలని విజ్ఞప్తి చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు
# 111 కోట్లు రూపాయలు చెల్లింపులు
### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు జిల్లా వ్యాప్తంగా 5201 ఇందిరమ్మ ఇండ్లకు గాను 111 కోట్లు చెల్లించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. బుధవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన పనులు ప్రారంభించి, నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.ప్రతివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల బిల్లులను చెల్లిస్తున్నట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ ఎంపీడీవో హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో
# ముఖ్య అతిథులుగా పాల్గొన్న
### గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి. బండారి గంగాధర్





మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ మండలం పిలుట్ల గ్రామానికి చెందిన మంగళ్పర్తి అంజయ్య మల్లమ్మ దంపతులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం నుంచి కేటాయించిన 5 లక్షల ఆర్థిక సహాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. గురువారం రోజున గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యతిథిగా పాల్గొని గృహప్రవేశం చేసి వారికి పట్టు వస్త్రాలు పెట్టి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసినమెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో శివంపేట్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్ ,ప్రముఖ సంఘ సేవకులు బీ సి నాయకులు బండారి గంగాధర్ ,మాజీ జడ్పీటీసీ లక్ష్మి కాంతం,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాధా కృష్ణ , గ్రామ కమిటీ అధ్యక్షులు రాఘవరెడ్డి శ్రీశైలం యాదవ్ ,సంద్ర సుదర్శన్, మన్నే శ్రీను, సర్పంచ్ కిషన్ నాయక్, దాడిగే నరేష్, బండారి నాగేష్, కుమ్మరి నాగరాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద ఆడపడుచు వివాహానికి
# అండగా నిలిచిన తూడి లచ్చన్న

- రూ. 20 వేలు నగదు ఆర్థికసాయం అందజేత
- సామాజిక సేవలను విస్తృతంగా కొనసాగిస్తాం
- ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత : తూడి లచ్చన్న



గంగాధర (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా, గంగాధర మండలం,కొండయ్యపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం మల్యాల రాజయ్య కుమార్తె ఐశ్వర్య వివాహానికి ప్రముఖ సామాజికవేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న రూ.20 వేల నగదు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లల వివాహాలు సజావుగా జరిగేలా చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. అవసరంలో ఉన్న వారికి తోడుగా నిలవడం ద్వారా సమాజంలో ఐక్యత, మానవత్వం పెరుగుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండయ్యపల్లి సర్పంచ్ మల్యాల వినయ్ సాగర్, టీఎల్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ముందు శ్రీరామ్ నగర్ లో
## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలి .
### బోయిని నారాయణ డిమాండ్




మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని 5వ వార్డ్ శ్రీరామ్ నగర్ గ్రామంలో రామాలయం దేవాలయం లో ప్రతి సంవత్సరం శ్రీరామనవమి పురస్కరించుకొని సీతరాములు మహోత్సవం కార్యక్రమానికి ఆలయం వద్ద ప్లేస్ సరిపోవడం లేదని మమ్మల్ని గెలిపిస్తే ఎస్ ఆర్ ఎస్ పి కాలువ పైన సిమెంట్ తో ఫ్లోరింగ్ పనులు చేయిస్తామని మంథని మున్సిపల్ ఎన్నికల ముందు శ్రీరామ్ నగర్ గ్రామ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంటనే నిలబెట్టుకోవాలని శ్రీరామ్ నగర్ గ్రామ ప్రజలందరి తరఫున కోరుతూ కొద్ది రోజులలో శ్రీరామనవమి కార్యక్రమం శ్రీరామ్ నగర్ గ్రామ ప్రజలు సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని మంథని మున్సిపల్ పరిధిలోనే అత్యంత అంగరంగ వైభవంగా ఎక్కడ లేని విధంగా జరుపుకుంటారని కావున శ్రీరామనవమిని పురస్కరించుకొని వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని భారతీయ జనతా పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, మంథని మున్సిపల్ 5వ వార్డు కాంటెస్టెడ్ కౌన్సిలర్ అభ్యర్థి బోయిని నారాయణ కాంగ్రెస్ పార్టీ నాయకులను డిమాండ్ చేయడం జరిగింది.

## నిబంధనలు పాటించని రోడ్డు కాంట్రాక్టర్
## ఆర్ అండ్ బి అధికారులు,విద్యుత్ శాఖ అధికారులు
### రోడ్డు వేశారు కరెంట్ పోల్ను మరిచారు..



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండల కేంద్రంలోని నూతన రోడ్డు నిర్మాణ పనులను ప్రజా సంఘాల నాయకులతో కలిసి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ పరిశీలించాడు ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో పాత పెట్రోల్ బంక్ ఏరియా మంథని నుండి పెద్దపల్లి,కాటారం కు వెళ్లే ప్రధాన రహదారి వెంట నూతన రోడ్డు నిర్మాణం కొనసాగుతోంది ఈ క్రమంలో రోడ్డుకు మధ్యలో ఉన్నటువంటి కరెంటు స్తంభాలను తీసివేయకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగింది ఇక్కడే సంబంధిత అధికారులైన ఆర్ అండ్ బి,మరియు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుందన్నారు ఇలా రోడ్డు మధ్యలో కరెంటు స్తంభాలు ఉండటం వలన ప్రయాణికుల రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు సంబంధిత అధికారులు మరియు కాంట్రాక్టర్ వెంటనే స్పందించి రోడ్డు మధ్యలో ఉన్నటువంటి కరెంటు పోల్ ను వెంటనే తొలగించి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు అతని వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ కేవీపీఎస్ జిల్లా నాయకులు ముంథని లింగయ్య ఉన్నారు.

## తాళం వేసిన ఇండ్లే దొంగలకు బంగారు బాట



ధర్పల్లి(ప్రశ్న న్యూస్ ) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో సబ్స్టేషన్ ఎదురుగా ఉన్న ఒక ఇంట్లో దొంగలు పడి తులం బంగారం సుమారు 15 వేల నగదు బట్టలు దోచుకు వెళ్లారు.ధర్పల్లి మండల కేంద్రం ఎదురుగా ఉన్న సబ్ స్టేషన్ సమీపంలో నివసిస్తున్న మంచి కట్టి రామ్ చందర్ అనారోగ్యంతో గత నెల రోజులు నుండి నిజామాబాదు జిల్లా కేంద్రంలో ట్రీట్మెంట్ చేయించుకుంటున్నారు. ఈయనకు ఐదుగురు కూతుర్లు. నాలుగవ కూతురు పెళ్లి సామాను బట్టలు కూడా ఈ ఇంట్లోనే ఉండటంతో దొంగలు బీరువా పగలగొట్టి దోచుకెళ్లారు. బాధితురాలు ప్రమీల మాట్లాడుతూ తన భర్త అనారోగ్య కారణంతో నిజాంబాద్ కేంద్రంలో చికిత్స అందిస్తున్నామని ఫిబ్రవరి 10వ తేదీ డ్వాక్రా గ్రూప్ పైసలు కట్టడానికి ధర్పల్లికి వచ్చి కట్టినామని అప్పుడు ఇల్లుకు తాళం వేసి వెళ్ళాం అన్నారు. గత 20 రోజుల నుండి ఇంట్లో ఎవరు లేకపోవడంతో తాళం వేసిన ఇండ్లను గుర్తించిన దొంగలు ఇంట్లో దొంగతనం కు పాల్పడ్డారని అన్నారు.పక్కింటి వాళ్ళు ఇచ్చిన సమాచారంతో తాలం పగలగొట్టిన మా ఇంటిని వచ్చి చూడగా అన్ని తలుపులు తెరిచి ఉండగా లబోదిబో ఇవ్వమంటూన్నారూ ధర్పల్లి కి వచ్చి వారి ఇంట్లో ఉన్న శుక్రవారం దేవి విగ్రహం వద్ద ఉంచిన 12 మాసాల బంగారం, సుమారు 15 వేల రూపాయలు నగదు ఎత్తుకు వెళ్లారు. ఇంట్లో ఉన్న బట్టలు పెళ్ళి సామాను వంట పాత్రలు అన్ని దోచుకు వెళ్లారు. ఇల్లంతా చిందర వందరగా చేసి కుకింగ్ స్టవ్ మీద వేసి నిప్పు పెట్టారని ఇంట్లో కరెంటు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని బాధితురాలు తెలిపింది. ఈ విషయమై ధర్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు పక్కింటి వారి సమాచారం ఇచ్చిన మేరకు సమాచారం అందుకొని మంచికంటి రామచందర్, భార్య ప్రమీల ఐదుగురు కూతుర్లు వచ్చి చూశారు.

## సనుగులలో కుటుంబంపై
# కుల బహిష్కరణ... సంఘం అధ్యక్షుడిపై కేసు

- చట్టవిరుద్ధమైన బహిష్కరణలు
- వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- చందుర్తి సబ్ ఇన్స్పెక్టర్ : జె. రమేష్



చందుర్తి /వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,చందుర్తి మండలం, సనుగుల గ్రామంలో ఓ కుటుంబంపై కుల బహిష్కరణ విధించిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై సంఘం అధ్యక్షుడు పోతుగంటి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై జె. రమేష్ తెలిపారు.గ్రామానికి చెందిన శశిపాల్ రెడ్డి కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన పంచాయతీలో అధ్యక్షుడు రెండు లక్షల రూపాయలు డిపాజిట్‌గా తీసుకున్నట్లు సమాచారం. సమస్య పరిష్కారం కాకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా నిరాకరించడంతో పాటు కుటుంబాన్ని సంఘం నుంచి బహిష్కరించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.అంతేకాకుండా, శశిపాల్ రెడ్డిని ఒక కార్యక్రమానికి ఆహ్వానించిన వ్యక్తికి రూ.5,000 జరిమానా విధించినట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. చట్టవిరుద్ధమైన బహిష్కరణలు, వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## స్నేహ భావానికి ప్రతీకగా
# న్యాయవాదుల హోలీ వేడుకలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ కోర్టు ఆవరణలో బుధవారం హోలీ పండుగను న్యాయవాదులు ఆనందంగా జరుపుకున్నారు.న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గుడిసె సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో న్యాయవాదులు ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్, జ్యోతిర్మయి పాల్గొని న్యాయవాదులతో కలిసి హోలీ వేడుకల్లో సందడి చేశారు. రంగుల హోలీతో కోర్టు ప్రాంగణం పండుగ వాతావరణంలో కళకళలాడింది.ఈ సందర్భంగా ఎజిపి బొడ్డు ప్రశాంత్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు నేరెళ్ల తిరుమల గౌడ్, పురుషోత్తం, పర్లపెల్లి అంజయ్య, గుండ రవి, కిషోర్ రావు, నక్క దివాకర్, అనిల్ కుమార్, జనార్ధన్ పాల్గొన్నారు. అలాగే మహిళా న్యాయవాదులు జక్కుల పద్మ, సుజాత, అన్నపూర్ణ, పడగెల మమత, బూర సరిత తదితరులు హాజరై సంబరాల్లో పాల్గొన్నారు.

## భక్తి భావంతో వివాహ వార్షికోత్సవం జరుపుకున్న
## కాంగ్రెస్ యువ నేత ప్రవీణ్ - శ్రీవిద్య దంపతులు

- ప్రతి ఒక్కరి జీవితంలో ఆధ్యాత్మికతకు ఎంతో ప్రాధాన్యం
- కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు : కొలువుల ప్రవీణ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకులు కొలుపుల ప్రవీణ్ -- శ్రీవిద్య దంపతులు తమ పెళ్లిరోజు వేడుకలను బుధవారం ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా హైదరాబాద్‌లోని శ్రీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబాను దర్శించుకొని తమ వివాహ వార్షికోత్సవాన్ని సాదాసీదాగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, దైవానుగ్రహంతో తమ దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని సాయిబాబాను ప్రార్థించినట్లు తెలిపారు.ప్రతి ఒక్కరి జీవితంలో ఆధ్యాత్మికతకు ఎంతో ప్రాధాన్యం ఉందని, దేవుడి ఆశీస్సులతో కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

## తండ్రి బాటలో తనయుడు
## నవీన్ ప్రజాసేవ ప్రస్థానం అభినందనీయం

- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్
- న్యాత రాజయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- తండ్రి స్మారకార్థం విగ్రహం ప్రతిష్ఠించిన యూత్ కాంగ్రెస్ నేత : న్యాత నవీన్
- రాజయ్య సేవలను స్మరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు - ప్రజలు



వేములవాడ.(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ తండ్రి, దివంగత న్యాత రాజయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని బుధవారం చందుర్తి మండలం,బండపల్లి గ్రామంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేములవాడ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజయ్య సమాజంలో విలువలతో జీవించిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని పేర్కొన్నారు. తనయుడు న్యాత నవీన్ తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు,మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆన్ లైన్ మోసాలు అరికట్టండి

**- బ్యాంకు అధికారులను ఆదేశించిన ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా**




నరసరావుపేట (ప్రశ్న న్యూస్ )మ్యూల్ అకౌంట్ల ద్వారా జరుగుతున్న ఆన్ లైన్ మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులను ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. కాలేజీ విద్యార్థుల బ్యాంకు అకౌంట్లకు డబ్బులు చెల్లించి మరీ మోసాలకు వాడుతున్న విధానాన్ని నిరోధించేందుకు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలునందు బ్యాంకు ప్రతినిధులతో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంకులు నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాల ద్వారా శిక్షణ పొందిన వారిలో 80 శాతం మందికి ఉపాధి లేదా వ్యాపార అవకాశాలు దక్కేలా చూడాలన్నారు.సూర్యఘర్ పథకం కింద సబ్సిడీ రుణాల వితరణ వేగవంతం చేయాలన్నారు. రికవరీ సమస్యలున్న డ్వాక్రా రుణాల అకౌంట్ల వివరాలు డీఆర్డీఏకు అందించాలన్నారు. విద్యార్థులకు హాస్టల్ ఫీజులు, ఇతర ఖర్చుల వినియోగానికి తక్కువ మొత్తంలో విద్యా రుణాలు అందించాలన్నారు. విద్యా రుణాలపై కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. రుణ వితరణ లక్ష్యాలు చేరుకోని బ్యాంకుల నుంచి వివరణ ఇవ్వాల్సివుంటుందన్నారు. జూన్-జులై నాటికి కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందించి పంట రుణ వితరణ జరిగేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. పశు పెంపకం దారులకు కేవలం నాలుగు శాతం వడ్డీతో ఒక్కో పశువుపై రూ.50,000 నుంచి రూ.లక్ష వరకూ అందించే రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. మార్చి మూడో వారంలోగా క్లస్టర్ విధానంలో మండలాల వారీగా ఏర్పాటు చేసిన క్లస్టర్ల అభివృద్ధికి రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్ పర్సన్ మక్కెన మల్లికార్జున రావు, ఎల్డీఎం రామ్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి

**- 6న జిల్లా ఇంచార్జి మంత్రి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం**


**- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం సాయంత్రం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అయిదు దశల్లో అమలు చేయనున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ క్షుణ్ణంగా వివరించారు. ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ నుంచి జిల్లా స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, ప్రజారోగ్యం, రోడ్డు భద్రతా చర్యలు, వివిధ వర్గాల వారి సంక్షేమం, కల్తీ కల్లు, మత్తు పదార్థాల నిరోధానికి చేపట్టాల్సిన పకడ్బందీ చర్యలు, రైతు సంక్షేమం.. వ్యవసాయం, విద్య, యువత.. క్రీడలు, మహిళల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా జిల్లాలో అన్ని ఆసుపత్రులు పి.హెచ్.సీ సెంటర్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, మాతా శిశు మరణాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జిల్లా జనరల్ ఆసుపత్రి పనితీరులో స్పష్టమైన మార్పు రావాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు ప్రజా ఆరోగ్యానికి ఎనలేని ప్రాధాన్యతనిస్తూ కల్తీ ఆహార పదార్థాలు నిరోధానికి ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. 14 - 15 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బాలికలకు హెచ్.పీ.వీ వ్యాక్సిన్ తప్పక అందేలా చూడాలన్నారు. సోలార్ విద్యుత్ వాడకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. మార్చి 6న జిల్లా ఇంచార్జి మంత్రి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై సన్నాహక సమావేశం ఉంటుందని, అన్ని శాఖల అధికారులు సమగ్ర వివరాలతో హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి

**- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ : గరిమా అగ్రవాల్**



**సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధికారులకు ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 6వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమాలు ప్రారంభించాలని తెలిపారు. గ్రామసభలు,ప్రత్యేక శిబిరాలు,అవగాహన కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

### ఐదు దశల్లో కార్యక్రమాలు

ఏప్రిల్ 2న గ్రామసభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాలు,మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు,మే 22న జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించనుండగా, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలతో కార్యక్రమాలు ముగుస్తాయని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో డీఆర్డీఓ గీత, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, డీపీవో షరీఫుద్దిన్, జిల్లా వైద్యాధికారి రజిత, హౌసింగ్ పీడీ సాజిద్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నీ అవినీతికి జోహార్లు

# మీ అక్రమ నిర్మాణాలకు జైజై లు

- అవినీతిలో టాప్ వన్ సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య నేనా.? - అక్రమ నిర్మాణాలపై జెడ్ సి, డిసి లు ఫిర్యాదులు పట్టించుకోరా.?
- అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్లు సెక్షన్ ఆఫీసర్ క్రిష్టయ్యకు సహకరిస్తున్నారా.? - సీజ్ చేసిన నిర్మాణాలలో యదేచ్ఛగా పనులు, ప్రారంభానికి సిద్ధం
- సెక్షన్ ఆఫీసర్ క్రిష్టయ్యకు ఉద్యోగం కంటే లంచాలంటేనే చాలా ఇష్టమా.? - ఎన్ని ఫిర్యాదులు వచ్చిన కిష్టయ్యను రక్షిస్తుంది ఎవరు.?
- జోనల్ కమిషనర్ నిర్లక్ష్యమే టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులకు శ్రీ రామ రక్షణ




**ముషీరాబాద్ (ప్రశ్న న్యూస్)** కవాడిగూడ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అశోక్ నగర్ రహదారిపై, కాలనీలలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను సీజ్ చేసి చేతులు దులుపుకోవడం ఆనవాయితిగా మారిందని అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి సీజ్ చేసిన భవనంలో నిర్మాణ పనులు యదేచ్ఛగా జరుగుతుంటే, పత్రికలలో కథనాలు వస్తుంటే సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య నిర్మాణ పనులను అడ్డుకొని తిరిగి సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో నిర్మాణదారులపై కేసు నమోదు చేయాలి. కానీ అలా చేయకపోవడం వెనక భారీ స్థాయిలో లంచాలు ముట్టాయని స్థానికులు మండిపడుతున్నారు. టి పి ఎస్ కిష్టయ్య పరిధిలో గతంలో ఉన్న ముషీరాబాద్ సర్కిల్ లో మాజీ ఏసీపి దేవేందర్ తో కలిసి భారీగా అక్రమ నిర్మాణాలు చేయించారని ఒక్కొక్క భవనం నుండి 10 లక్షల వరకు లంచాలు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దానితో ఈ అధికారులు అవినీతి సొమ్ముతో కోట్లకు పడగలెత్తారని స్థానికులు విజిలెన్స్, ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పునర్విభజన తర్వాత కూడా ఇక్కడే పాతుకుపోయిన సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య ఇప్పటికీ తన అక్రమ నిర్మాణాల దందాను ఆపడం లేదని కార్పొరేటర్ పేరుతో భవన నిర్మాణాలు చేయిస్తున్నారని పత్రికలలో కథనాలు వచ్చిన చర్యలు తీసుకోకపోవడం వెనక ఆయనకు డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్ పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉన్నత అధికారులకు లంచాలలో వాటాలు ఇవ్వడంతోనే అక్రమ నిర్మాణాల ఫిర్యాదులను, పత్రికలో వచ్చిన కథనాలను చూసి చూడనట్లు వదిలేస్తున్నారని స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### మున్సిపల్ శాఖలో అవినీతి కట్టడి చేయలేరా.?






గతంలో ఉన్న బీఆర్ఎస్ గవర్నమెంట్ ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ గవర్నమెంట్ ముఖ్యమంత్రులు మున్సిపల్ శాఖలో ఉన్న అవినీతి అక్రమాలను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం చెందారు. ఎంతో కొంత గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి కట్టడి చేసిన ప్రస్తుతం రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం మున్సిపల్ శాఖలో అవినీతి ఆక్రమాలను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం చెందింది. ఇక జిహెచ్ఎంసి లో ఉన్న విజిలెన్స్ విభాగం పూర్తిగా పనికి రాకుండా పోయిందని విజిలెన్స్ అధికారులు అవినీతి కి పాల్పడుతున్న మున్సిపల్ సిబ్బంది, అధికారులతో అంతర్గత ఒప్పందాలు చేసుకొని వాళ్లు కూడా లంచాలు తింటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకోసమే చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు బాహటంగా విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఈ రెండు సంవత్సరాలలో మున్సిపల్ శాఖలో అతి ఘోరంగా అవినీతి పెరిగిందని దీనిని కట్టడి చేయకుంటే వ్యవస్థ పూర్తిగా నాశనం అయిపోతుందని సాక్షాత్ ముఖ్యమంత్రి కి ట్వీట్ ద్వారా ప్రజలు ఫిర్యాదులు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది. ఒక్కసారి జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఏసీపీలు, సెక్షన్ ఆఫీసర్లు చివరికి చైన్ మెన్ల పైన కూడా ఏసీబీ దాడులు చేపిస్తే వెయ్యిల కోట్లలో అక్రమ సొమ్ము బయటకి వస్తుందని ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచిస్తున్నారు. ఇప్పటికైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న మున్సిపల్ కార్యాలయాలలో అవినీతిని కట్టడి చేస్తారరో లేకుంటే మీ ఇష్టం దోచుకున్నోడికి దోచుకున్నంత అని వదిలేస్తారో వేచి చూడాలి.

# రంగ్ బర్సే



**- మండల వ్యాప్తంగా ఆనందోత్సాహాలతో హోలీ సంబురాలు**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మండల వ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. హోలీ హోలీరే హోలీ చమ్మకేలీరే హోలీ అంటూ ఉదయం నుంచే ఒకరి పై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాల్లో మునిగిపోయారు. యువకులు బైక్ పై తిరుగుతూ రంగులు చల్లుకున్నారు. హోలీ వేడుకలను అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సహాల మధ్య జరుపుకున్నారు. నిత్యం క్షణం తీరిక లేకుండా ప్రభుత్వ కార్యక్రమాల్లో గడిపే అధికారులు హోలీవేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మొదలుకొని గ్రామ అధికారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కుల సంఘాల నాయకులు ఉత్సాహబరితమైన వాతావరణంలో హోలీ పండుగను జరుపుకున్నారు. అధికారులకు ఉద్యోగులు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పలు రాజకీయ నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లను పంపిణీ చేశారు. యువతీ యువకులు మాత్రం హోలీ పండుగలో ప్రకృతి సిద్ధమైన రంగులతోనే పండుగను జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన హోలీ వేడుకల్లో ఉత్సాహబరితంగా వివిధ వర్గాల ప్రజలు పాల్గొని హోలీ పండుగకు మరింత శోభను తెచ్చారు. పలువురు అనాదిగా వస్తున్న కుడుకలు, బత్తిసా, బిస్కిట్ల అంజీరా పేర్లను చిన్నారులకు వేసే సాంప్రదాయాన్ని కొనసాగించారు. చిన్నారులు ముసిముసి నవ్వులతో ఆ పేర్లను చూసి మురిసిపోయారు. చిన్న పిల్లలు తోటిపిల్లలపై బంధువుల ఇళ్ల వద్ద రంగులు పోసుకోవడంతో వీధులన్ని రంగునీళ్లను చల్లుకున్నారు. యువకులు వీధుల గుండా ఒకే బైక్ పై ఇద్దరు.. ముగ్గురు, రుయ్... రుయ్ మంటూ బైకులపై తిరుగుతూ రంగులను చల్లుకున్నారు. రంగులతో పాటు కోడిగుడ్లు, టమాటాలతో కొట్టుకుంటు ఉత్సాహంగా జరుపుకున్నారు.

# కనికరం లేని కసాయి తల్లి

**- నాయుడుపేటలో అమానవీయ ఘటన - నవమాసాలు మోసి ముళ్లపదల్లో పారేసిన కసాయి తల్లి**

**- ఆ పసిపాపను అక్కున చేర్చుకున్న నాయుడుపేట చంద్రబాబు నాయుడు కాలనీ వాసులు**

**తిరుపతి (ప్రశ్న న్యూస్)** తల్లి ప్రేమ అంటే అమృతం అంటారు, కానీ ఇక్కడ ఆ ప్రేమే విషమైంది. తొమ్మిది నెలలు మోసి, కళ్లు కూడా తెరవని ఆ పసికందును ముళ్లపొదల్లోకి విసిరేసింది ఒక కసాయి తల్లి. మృత్యువుతో పోరాడుతున్న ఆ పసిపాప వేసిన మూగ రోదన నాయుడుపేట పట్టణాన్ని వణికించింది.తొమ్మిది నెలలు మోసి, కళ్లు కూడా తెరవక ముందే ఆ కన్నపేగు కసాయిగా మారింది. వెచ్చని అమ్మ ఒడిలో సేదతీరాల్సిన ఆ పసికందు.. ముళ్లపొదల్లో మృత్యువుతో పోరాడింది. అమ్మా.. నేనేం పాపం చేశాను. నన్నెందుకుఇలాముళ్లపాలజేశావు.అని ఆ పసిపాప వేస్తున్న మూగ రోదన నాయుడుపేట పట్టణాన్ని కన్నీరుతో కలిచివేసింది.



తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణం చంద్రబాబు నాయుడు కాలనీలో అమానవీయ సంఘటన చోటుచేసుకింది .అన్యం పుణ్యం తెలియని అప్పుడే పుట్టిన పసికందు ముళ్ళపదల్లో ఏడుస్తూ కనిపించింది. అర్ధరాత్రి పాప కేకలు విన్న స్థానికులు దెయ్యంగా భావించి ఎతకడం ప్రారంభించారు. తీరా చూడగా ముళ్లపొదల్లో ఏడుస్తూ పసిపాప కనిపించింది.పసిపాప ను అక్కున చేర్చుకుని...అంగన్వాడికి సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఇక వివరాలలోకి వెళితే నాయుడుపేట పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనిలో మంగళవారం అర్ధరాత్రి ముళ్లపొదల్లో నుండి పసిపాప ఏడుపులు వినిపిస్తున్నాయి. అర్ధరాత్రి కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంట్లోనుండి సుజాత అనే మహిళ బయటకు రాగ పసిపాప ఏడుపులు వినిపిస్తున్నాయి.దీంతో అందరిని లేపిన మహిళ చుట్టూ ప్రక్కల ప్రాంతాలను గలించగా...ఓ ముళ్లపొదల్లో అప్పుడే జన్మించిన పాప...బొడ్డుకుడా కత్తిరించకుండా ఉన్న పసికందు ఏడుస్తూ కన్పించింది.దీంతో స్థానికులు రాత్రంతా ఆ పసికందును సంరక్షించి ఉదయాన్నే ఐసిడిసి సిడిపిఓ ఉమామహేశ్వరికి అప్పగించారు.

### - మానవత్వం చాటుకున్న చంద్రబాబు నాయుడు కాలనీ స్థానికులు

ఆ దృశ్యాన్ని చూసి స్థానికులు చలించిపోయారు. వెంటనే ఆ పాపను అక్కున చేర్చుకుని, ఒంటిపై ఉన్న ముళ్లను తొలగించి ప్రాథమిక సంరక్షణ అందించారు. బుధవారం ఉదయం సిడిపిఓ ఉమామహేశ్వరికి సమాచారం అందించగా, ఆమె వెంటనే చేరుకుని పాపను స్వాధీనం చేసుకున్నారు.బిడ్డను స్థానిక నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు అందించి తదుపరి తిరుపతి లోని శిశుసంరక్షణశాలకు తరలించ నున్నట్లు ఆమె తెలిపారు.ఈ ఘటనపై నాయుడుపేట పోలీసులకి సిడిపిఓ పిర్యాదు చేసారు. నిందుతులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. అయితే పసికందును స్థానికులు తాము పెంచుకుంటామని అడగగా...చట్టప్రకారం దత్తత తీసుకోవాలని సూచించారు.తల్లి పొత్తిళ్లలో సెదతీరాల్సిన ఆ పసికందు ముళ్లపొదల్లో ఉండడం తెలుసుకున్న ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

# ఏప్రిల్‌లో 'ఆర్‌కే దీక్ష'

ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకనిర్మాణంలో రూపొందించిన చిత్రం 'ఆర్‌కే దీక్ష'. కిరణ్,



అలేఖ్యరెడ్డి, ఆక్సఖాన్ ప్రధాన పాత్రధారులు. ఏప్రిల్ మొదటివారంలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌కే గౌడ్ మాట్లాడుతూ 'ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దాదాపు వంద స్క్రీన్స్‌లో రిలీజ్ చేయబోతున్నాం. దీక్ష, పట్టుదల ఉంటే జీవితంలో ఎలాంటి కార్యాన్నైనా సాధించవొచ్చనే సందేశాత్మక కథాశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. పాటలకు మంచి పేరొచ్చింది' అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు రోహిత్‌శర్మ, తులసి పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రాజ్‌కిరణ్, నిర్మాణ సంస్థ: ఆర్‌కే ఫిల్మ్స్, సిగ్ధ క్రియేషన్స్, దర్శకత్వం, నిర్మాణం: ఆర్‌కే గౌడ్.

# తెలివైన నిర్ణయాలతో దూసుకెళ్తున్న శ్రీలీల..

టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇప్పుడు తన కెరీర్‌ను ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటూ ముందుకు సాగుతోంది. గ్లామర్, డ్యాన్స్, ఎనర్జీతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ యంగ్ బ్యూటీ, కేవలం ఐటమ్ సాంగ్స్‌కే పరిమితం అయితే కెరీర్‌పై ప్రభావం ఉంటుందని ముందుగానే అంచనా వేసి జాగ్రత్త పడినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.కొన్ని ప్రాజెక్టుల్లో హీరోయిన్ అవకాశంతో పాటు ఐటమ్ సాంగ్ చేయాలని కండీషన్స్ పెట్టినప్పుడు, ఆ ఆఫర్లను సైతం వదులుకోవడంలో ఆమె వెనుకాడలేదని సమాచారం. స్క్రిప్ట్, పాత్ర ప్రాముఖ్యత, భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటోందని, ప్రతి ప్రాజెక్ట్ ముందు కుటుంబ సలహాలు కూడా తీసుకుంటోందని టాక్. ప్రస్తుతం శ్రీలీల తెలుగు సినిమాల కంటే హిందీ, తమిళ చిత్రాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. ఇప్పటికే బాలీవుడ్‌లో సంచలన మ్యూజికల్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఆషికి 3 లో ఆమె హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో బాలీవుడ్ స్టార్ కార్తీక్ ఆర్యన్‌కు జోడీగా కనిపించనుంది. ఈ చిత్రానికి అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్నారు. సినిమాలో భావోద్వేగాలు, ఇంటిమేట్ సన్నివేశాలు ఉన్నప్పటికీ, పాత్రకు అవసరమైతే పూర్తి స్థాయిలో న్యాయం చేయడానికి సిద్ధమని శ్రీలీల సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ ఈ సినిమా హిట్ అయితే, ఆమె బాలీవుడ్ కెరీర్‌కు గేమ్ చేంజర్ అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో శ్రద్ధా కపూర్కూడా 'ఆషికీ 2'తో భారీ గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. ఇక ఇదే కాంబినేషన్‌లో మరో యాక్షన్ థ్రిల్లర్ కూడా ప్లాన్ చేస్తున్నారనే వార్తలు బాలీవుడ్ మీడియాలో వినిపిస్తున్నాయి.

'ఫీటమ్ పురా' అనే టైటిల్ పరిశీలనలో ఉందని ప్రచారం. అధికారిక ప్రకటన రానప్పటికీ, ఒక సినిమా సెట్స్‌పై ఉండగానే మరో సినిమా ఆఫర్ రావడం ఆమె క్రేజ్‌ను చూపిస్తోంది. అంతేకాకుండా, కోలీవుడ్ స్టార్ ధనుష్ 55వ చిత్రంలోనూ శ్రీలీల హీరోయిన్‌గా ఎంపికైనట్లు సమాచారం. కెరీర్ ప్రారంభ దశలోనే ధనుష్ సరసన నటించే అవకాశం రావడం ఆమెకు పెద్ద ప్లస్‌గా భావిస్తున్నారు. ఇక టాలీవుడ్‌లో ఆమె నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ త్వరలో విడుదల కానుంది. ఇందులో పవన్ కళ్యాణ్‌కు జోడీగా కనిపించనుంది. ఈ చిత్రం విజయం సాధిస్తే శ్రీలీల పేరు మళ్లీ టాలీవుడ్‌లో మారుమ్రోగడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలివైన నిర్ణయాలతో కెరీర్‌ను ప్లాన్ చేసుకుంటున్న శ్రీలీల, దక్షిణాది నుంచి బాలీవుడ్ వరకూ తన మార్క్ చూపించడానికి సిద్ధమవుతోంది. రానున్న రోజులు ఆమె కెరీర్‌కు కీలకంగా మారనున్నాయి.



# నా నటనలో కొత్త కోణాన్ని చూస్తారు

'ఇందులో నా పాత్ర పేరు ఉత్తర. ఇప్పటివరకూ ఈ తరహా పాత్ర నేను చేయలేదు. మంగపతిగా



జనాల హృదయాల్లో ఓ పవర్‌ఫుల్ వ్యక్తిగా నిలిచిపోయిన శివాజీనే డామినేట్ చేసే పాత్ర నాది. శివాజీ కూడా ఈ పాత్ర పోషణ విషయంలో నన్నెంతో ఎంకరైజ్ చేశారు' అని తెలిపారు సీనియర్ నటి లయ. శివాజీకి జోడీగా ఆమె నటించిన క్రైమ్ కామెడీ ఫ్యామిలీ థ్రిల్లర్ 'సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. శివాజీ స్వయంగా నిర్మించిన ఈ చిత్రాన్ని ఈటీవీ విన్‌తో కలిసి బన్నీవాస్, వంశీ నందిపాటి సమర్పిస్తున్నారు. ఈ నెల 6న సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో లయ విలేకరులతో ముచ్చటించారు. 'శివాజీతో కలిసి నటించి 20ఏళ్లు అవుతున్నది. తనతో సినిమా అనగానే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అనుకున్నాను. కానీ ఇది అన్ని వయసులవారికీ నచ్చే అవుట్ అండ్ అవుట్ కామెడీ క్రైమ్ జోనర్. ఇందులో డార్క్ కామెడీతోపాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి' అని పేర్కొన్నారు లయ. సినిమాను అన్ని రకాలుగా ప్రేమించే పాషన్ ఉన్న నటుడు శివాజీ అని, అప్పటికంటే ఇప్పుడు తనకు సినిమాపై ప్రేమ మరింత పెరిగిందని, పూర్తి క్లారిటీతో సినిమాను దర్శకుడు సుధీర్ శ్రీరామ్ తెరకెక్కించారని, నటిగా తనలోని కొత్త కోణాన్ని ఈ సినిమాలో చూస్తారని లయ చెప్పారు.



# ఉత్కంఠతో సాగే ప్రయాణం

**'థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ట్విస్టులు, ఎమోషన్స్‌తో కూడిన ప్యాకెజ్ పటాక 'సరస్వతి'. ఇదొక క్రైమ్ థ్రిల్లర్. రెండుగంటల పాటు ఉత్కంఠతో సాగే ప్రయాణం ఇది. ఇందులో సోషల్ మెసేజ్ కూడా ఉంది. ఒక బలమైన స్త్రీని ఇందులో చూస్తారు' అని నిర్మాత పూజా శరత్‌కమార్ అన్నారు. ఆమె సహోదరి వరలక్ష్మి శరత్‌కుమార్ నటించి, దర్శకత్వం వహించిన క్రైమ్ థ్రిల్లర్ 'సరస్వతి'కి పూజ శరత్‌కుమార్ నిర్మాత. ఈ నెల 6న సినిమా విడుదల కానుంది.ఈ సందర్భంగా మంగళవారం పూజా శరత్‌కుమార్ విలేకరులతో ముచ్చటించారు. 'కోర్ట్ సీన్స్ ఈ కథలో కీలకం. ముఖ్యంగా ఓ కోర్ట్ సీన్‌లో 7 నిమిషాల సింగిల్ షాట్ ఒకటుంది. అది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. నటిగా వరలక్ష్మిని మరో మెట్టుపై నిలబెట్టే సినిమా ఇది. గొప్ప విజన్‌తో తయారైన పాత్ర ప్రియమణిది. అదేంటో తెరపై చూస్తారు. ప్రకాష్‌రాజ్, నాజర్‌లతో పాటు అందరూ మనసుపెట్టి నటించారు. సాంకేతికంగా కూడా సినిమా నెక్స్ట్ లెవల్లో ఉంటుంది' అని పూజా శరత్‌కుమార్ చెప్పారు.**

# ఓ పొగరుబోతు కథ

'నిజానికి మా టైటిల్ 'మెన్షన్ హౌస్ మల్లేష్'. అయితే.. ఓవర్ లుక్‌లో టైటిల్ 'మాన్షన్



హౌస్ మల్లేష్' అనిపిస్తుంది. ఈ కథకు టైటిల్ క్యాచీగా ఉండాలి. అందుకే ఈ టైటిల్ పెట్టాం. దారితప్పిన ఓ పొగరుబోతుని అతని తల్లి, భార్య ఎలా దారిలోకి తెచ్చారు? అనే ప్రశ్నకు సమాధానమే ఈ సినిమా' అని హీరో శ్రీనాథ్ మాగంటి అన్నారు. ఆయన హీరోగా నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'మెన్షన్ హౌస్ మల్లేష్'. గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల కథానాయికలు. బాల సతీష్ దర్శకుడు. రాజేష్ నిర్మాత. ఈ నెల 6న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో హీరో శ్రీనాథ్ మాగంటి విలేకరులతో ముచ్చటించారు. 'ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఇందులో నేను కొత్తగా కనిపిస్తా. ఈ పాత్ర కోసం రియల్ కేరక్టర్లని అబ్జర్వ్ చేశా. మా అమ్మ పాత చున్నీ ఉంటే, దాన్ని చొక్కాగా కుట్టించుకొని వేసుకున్నా. మల్లేష్‌గా మారడానికి నిజంగా చాలా కష్టపడ్డాను. దర్శకుడు బాలసతీశ్ క్లారిటీ ఉన్న దర్శకుడు. ఈ సినిమాతో కచ్చితంగా అతనికి మంచి పేరొస్తుంది. నిర్మాత రాజేష్ ఎక్కడా రాజీ పడలేదు. సాంకేతికంగా అన్ని విధాలా సినిమా బావుంటుంది' అని శ్రీనాథ్ మాగంటి తెలిపారు.

## ఉద్యోగాల తొలగింపులపై

# ప్రభుత్వం న్యాయం చేయాలి




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** మహాత్మా గాంధీ సాంకేతిక విద్యాలయంలో తమకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం స్పందించాలని డా. కె. ఉదయాని, వి. యాదగిరి, జి. సంజీవ తమపై జరిగిన అన్యాయాలను వెల్లడించారు. ఉద్యోగ భద్రత, కుల వివక్ష, అంగవికలత ఆధారిత వేధింపులపై వారు తీవ్ర ఆరోపణలు చేశారు.డా. ఉదయాని మాట్లాడుతూ తాను జూన్ 2015 నుంచి 2024 వరకు మహాత్మా గాంధీ సాంకేతిక విద్యాసంస్థలో సేవలందించినప్పటికీ తన సేవలను స్థిరపరచలేదని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ నిర్వహించిన ఎంపిక ప్రక్రియను మూడుసార్లు పూర్తి చేసినప్పటికీ తన నియామకాన్ని క్రమబద్ధీకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ప్రసూతి సెలవులో ఉండగానే తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆరోపించారు. వి. యాదగిరి మాట్లాడుతూ తాను చైతన్య భారతీ సాంకేతిక విద్యాసంస్థలో 17 సంవత్సరాలు పనిచేశానని తెలిపారు. కుల వివక్ష ఘటనల్లో సాక్షిగా నిలిచినందుకే అక్రమంగా తొలగించారని ఆరోపించారు. ఇది తనపై జరిగిన ప్రతీకార చర్య అని పేర్కొన్నారు. జి. సంజీవ మాట్లాడుతూ తాను ఎస్సీ కులానికి చెందిన అంగవికలత గల వ్యక్తినని తెలిపారు. చైతన్య సాంకేతిక విద్యాసంస్థలో కులం మరియు అంగవికలత ఆధారంగా వేధింపులకు గురయ్యానని ఆరోపించారు. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు.తమకు ప్రాణహాని ముప్పు ఉందని పేర్కొంటూ, తక్షణ న్యాయం, భద్రత కల్పించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

## 30 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు

## నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ :హోంమంత్రి అనిత



**అమరావతి(ప్రశ్న న్యూస్)**ఏపీ శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ,అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు రావటంతో మార్పులు అవసరమైనట్లు చెప్పారు.

ఈ సవరణ ద్వారా భవన నిర్మాణ అనుమతులను జాతీయ నిబంధనల మేరకు సవరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అగ్నిమాపక పరికరాలు లేని భవనాలపై జరిమానాలను భారీగా పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. నిర్దేశిత కాలపరిమితి ప్రకారం అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అగ్నిమాపక పరికరాల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చేలా చట్టంలో సవరణ చేసినట్లు తెలిపారు. వాణిజ్య, పారిశ్రామిక, నివాస భవనాలకు ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తున్నామన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర మార్గాలు, అగ్నిమాపక పరికరాలతో పాటు తగిన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అనిత పేర్కొన్నారు. సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం, ఆధునిక రక్షణ విధానాలపై అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు 21 నుంచి 30 రోజుల్లో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భవన ప్రాంగణాన్ని సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత హెచ్చరించారు. ఈ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

## విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా

# 3,371 అధ్యాపక పోస్టులు

- నూతన నోటిఫికేషన్ కు కూటమి ప్రభుత్వం నిర్ణయం
- వచ్చే మూడు నెలల్లో యుద్ధప్రాతిపదికన ఖాళీలను భర్తీచేస్తాం
- శాసనమండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



**అమరావతి(ప్రశ్న న్యూస్)** విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వచ్చే మూడు నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల సంఖ్య, ఆయా ఖాళీలను ఎప్పటిలోగా పూర్తిచేస్తారని శాసనమండలిలో సభ్యుడు బొర్రా గోపిమూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో 3,371 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్నత న్యాయస్థానంలో పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించి 3 నెలల్లో అవసరమున్న ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటాం. ఖాళీల భర్తీకి 2018, 2023లో నోటిఫికేషన్ ఇచ్చారు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ పాటించకపోవడంతో 2023 నోటిఫికేషన్ ను కోర్టు తప్పుబట్టింది. దీంతో సదరు ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటికే మేం ఏఏజీతో మూడుసార్లు సమావేశం కావడం జరిగింది. పూర్తిస్థాయిలో చర్చించాం. నూతన నోటిఫికేషన్ ఇవ్వాలని మేం నిర్ణయం తీసుకున్నాం. యుద్ధప్రాతిపదికన పెండింగ్ పోస్టులను వచ్చే మూడు నెలల్లో భర్తీ చేయాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. గత ప్రభుత్వంలో రాజకీయ కోణంలో కొన్ని అపాయింట్ మెంట్లు జరిగాయి. దీనివల్ల యూనివర్సిటీల్లో ఎంతమంది సిబ్బంది అవసరం, ఎవరు ఏ పనిచేస్తున్నారో మ్యాన్ పవర్ ఆడిట్ చేయాల్సిన అవసరం ఉంది. ఆడిట్ పూర్తి అయిన తర్వాత స్పష్టత వస్తుంది. కాంట్రాక్ట్ ఉద్యోగులకు వెయిటేజ్ విషయంలో లీగల్ ఒపీనియన్ తీసుకుంటున్నాం. చేయాలనే తపన మాకు ఉంది. లీగల్ గా ఇబ్బంది పడకూడదు. చరిత్రలో ఎక్కడా జరగని విధంగా 150 రోజుల్లో డీఎస్సీ పూర్తిచేశాం. 16వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం. దానికి కారణం గత నోటిఫికేషన్లలో తప్పులు సరిదిద్దడమే. కమిటీ వేసి కచ్చితంగా అమలుచేశాం. ఇంకా మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉంది. కాంట్రాక్టు ఉద్యోగుల విషయంలో కూడా ప్రభుత్వం సుముఖంగా ఉంది. వయస్సు విషయానికి వస్తే ఇప్పటికే జీవోఎం ఏర్పాటుచేయడం జరిగింది. చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం ఉంది. ఉన్నత విద్యలో పలు సంస్కరణలు తీసుకువచ్చాం. కమిషనరేట్లను కూడా బలోపేతం చేస్తాం. ఆ బిల్లు కూడా వస్తుంది. అన్ని సమస్యలపై నేను వ్యక్తిగతంగా సమీక్షిస్తున్నాను. నియామకాలను చాలా సీరియస్ గా తీసుకుంటున్నాం. తప్పనిసరిగా యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తాం. వచ్చే మూడు నెలల్లో న్యాయ సమస్యలను పరిష్కరించి నోటిఫికేషన్ పై ముందుకు వెళ్తామని తెలిపారు

# మంత్రి అచ్చెన్నాయుడు రాజీనామా చేయాలి

- సభలో అడుగుపెట్టకుండా చర్యలు తీసుకోవాలి - టీడీపీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేయాలి.
- వైయస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ గడికోట శ్రీకాంత్ రెడ్డి డిమాండ్
- తాను క్రిస్టియన్ కాదు అని చెప్పుకోవాల్సిన దుస్థితి కల్పించారు
- హెరిటేజ్ అవినీతికి సమాధానం చెప్పుకోలేకే ఈ దిగజారుడు రాజకీయాలు



తాడేపల్లి(ప్రశ్న న్యూస్)రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న మండలి చైర్మన్‌కి మతం, పార్టీ ఆపాదిస్తూ మాట్లాడిన సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని, సభలో అడుగుపెట్టకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనపై చర్యలు తీసుకోవాలని వైయస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ గడికోట శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఇన్నాళ్లు దేవుడిని రాజకీయాల్లోకి లాగి ఆలయ ప్రతిష్టను మసకబార్చిన కూటమి నాయకులు.. మాట్లాడాల్సిన సబ్జెక్టుని పక్కన బెట్టి శాసనమండలి చైర్మన్‌ని చర్చలోకి లాక్కురావడమే కాకుండా ఆయన్ను కులమతాల పేరుతో కించపరచడం దారుణమని ఆయన ఆక్షేపించారు. రాజ్యాంగ వ్యవస్థలో ఈరోజును చీకటిరోజుగా చూడాలని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన జి.శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.మండలి ఛైర్మన్‌ను అవమానించడం దారుణం.కల్తీ నెయ్యి పేరుతో టీటీడీ నిధుల దోపిడీకి పాల్పడిన హెరిటేజ్ అంశం మండలిలో చర్చకు రావడంతో దానికి సమాధానం చెప్పలేక సభలో లేని వైయస్ జగన్ , మండలి చైర్మన్లు క్రిస్టియన్లు అని మాట్లాడుతూ సభను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడం అత్యంత హేయమైన చర్య. పైగా మీ నాయకుడు జగన్ అంటూ మండలి చైర్మన్‌కు పార్టీని ఆపాదించి అవమానించారు.ఇందాపూర్ డెయిరీ ముసుగులో హెరిటేజ్ చేసిన టీటీడీ నిధుల దోపిడీపై వైయస్సార్‌సీపీ సభ్యులు ప్రశ్నిస్తుంటే వాటికి సమాధానం చెప్పుకోలేని ప్రభుత్వం సభను పక్కదోవ పట్టించడానికి చైర్మన్‌ని రాజకీయాల్లోకి లాగి మతాన్ని, పార్టీని ఆపాదించింది.

### అధికార పక్ష సభ్యుల అనైతిక ప్రవర్తన..

అధికార పార్టీ సభ్యులం అన్న విషయమే మరిచిపోయి వైయస్సార్‌సీపీ సభ్యులు మాట్లాడుతుండగా ప్రసంగానికి పదులసార్లు అడ్డుతగలడమే కాకుండా మంత్రులంతా పోడియం చుట్టుముట్టి సభలో ఆందోళన చేయడం సిగ్గుచేటు. నేను ఫలానా మతం అని మండలి చైర్మన్ చెప్పుకునే దుస్థితి కల్పించినందుకు ప్రభుత్వం సిగ్గుపడాలి. పరిస్థితులు తమకు అనుకూలంగా లేకపోతే ఎవరికైనా కులమతాలు అంటగట్టి దిగజారుడు రాజకీయాలు చేస్తామని కూటమి నాయకులు చెప్పకనే చెబుతున్నారు.

### అచ్చెన్నాయుడిపై చర్య తీసుకోవాలి:

ఇప్పటికైనా సీఎం చంద్రబాబు కలగజేసుకుని మంత్రి కె.అచ్చెన్నాయుడిని రాబోయే మూడేళ్లపాటు సభలో అడుగుపెట్టకుండా శాశ్వతంగా సభ నుంచి సస్పెండ్ చేయాలి. మంత్రి అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటిస్తే సరిపోదు. ఆయన తన పదవికి రాజీనామా చేయాలి. తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేయాలి. శ్రీవారిని రాజకీయాల్లోకి లాగినందుకు కూటమిని ప్రజలు అసహ్యించుకుంటుంటే దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు కులమతాలతో రాజకీయాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని జి.శ్రీకాంత్‌రెడ్డి అభివర్ణించారు.

# వాసుపల్లి ఇంటికి జగన్

- ఘన స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే గణేశ్ కుమార్ - నూతన వధూవరులు సాకేత్, శ్రావణి దంపతులకు ఆశీర్వాదాలు
- దక్షిణ నేతలతో మాటామంతి - భవిష్యత్తు వైసిపిదేనన్న జగన్



**విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)** ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డివిశాఖ దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఇంటిని సందర్శించారు. ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. మహిళలు హారతులిచ్చి పూలాభిషేకం చేశారు. జై జగన్ సీఎం అంటూ వాసుపల్లి నివాసం వద్ద అశేష జనవాహిని కి జగన్మోహన్ రెడ్డి అభివాదాలు తెలిపారు. ముందుగా ఇటీవల వివాహం చేసుకున్న వాసుపల్లి రెండో కుమారుడు సాకేత్ , శ్రావణి లను ఆయన ఆశీర్వదించారు.

వాసుపల్లి కుటుంబ సభ్యులతో ఫోటో దిగారు. అనంతరం వైసీపీ నేతలతో ఆయన మాట మంతి తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పై స్పందించి, ప్రజల తరఫున పోరాటం చేయాలని పేర్కొన్నారు.చివరగా మనం ప్రజల మంచి కోసమే పోరాటం చేయాలని అన్నారు.ఈ విషయంలో ఎటువంటి రాజీ పడవద్దు అని చెప్పారు.అలాగే పార్టీ బలోపేతానికి కూడా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించాలన్నారు.కార్యకర్తలు అందరిని కలుపుకొని వెళ్లాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నియంతృత్వ పోకడలకు శ్రీకారం చుట్టిందని, పార్టీ నేతలపై కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ, బెదిరింపులకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు.ఎవరు అధైర్య పడవద్దు అని చెప్పారు. భవిష్యత్తు వైసిపిదే అని ధీమా వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరు ప్రజలతో మమేకమవుతూ, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ కన్నబాబు, అనకాపల్లి మాజీ ఎంపీ సత్యవతి, మాజీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, వైయస్సార్సిపి జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ కోలా గురువులు , మాజీ ఎమ్మెల్యేలు ధర్మాన ప్రసాదరెడ్డి, గొల్ల బాబురావు, తైనాల విజయ్ కుమార్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, వైయస్సార్‌సీపీ నేతలు పేడాడ రమణకుమారి, ఆల్ఫా కృష్ణ, కార్పొరేటర్లు, దక్షిణ వార్డు అధ్యక్షులు సీనియర్ నాయకులు అనుబంధ సంఘాల అధ్యక్షులు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# దేవుడంటే మా కుటుంబానికి అపారమైన గౌరవం

- గత పదేళ్లుగా దేవాన్ష్ పుట్టినరోజున తిరుమలలో అన్నదానం చేస్తున్నాం
- అలాంటి మాపై ఆరోపణలు చేస్తున్నారు
- మీ నాయకుడు జగన్ రెడ్డి డిక్లరేషన్ పై కనీసం సంతకం పెట్టలేదు
- తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ జరిగిందని సీబీఐ ఛార్జిషీట్ లో స్పష్టంగా చెప్పారు
- కల్తీ జరగలేదని చెప్పడానికి వైసీపీ నేతలకు సిగ్గుండాలి, దేవుడు మిమ్మల్ని వదిలిపెట్టడు
- మండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలపై నిప్పులు చెరిగిన మంత్రి లోకేష్



**అమరావతి(ప్రశ్న న్యూస్ )** దేవుడంటే మా కుటుంబానికి అపారమైన గౌరవం ఉంది. గత పదేళ్లుగా దేవాన్ష్ పుట్టినరోజున తిరుమలలో అన్నదానం చేస్తున్నాం. అలాంటి మాపై ఆరోపణలు చేస్తున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ అంశంపై మండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. మండలిలో వైసీపీ నేతల తీరుపై మంత్రి నారా లోకేష్ నిప్పులు చెరిగారు. నెయ్యి కల్తీ అంశంపై శాసనమండలిలో చర్చ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీపై తీవ్ర ఆరోపణలు చేశారు. వైసీపీ సభ్యుల ఆరోపణలపై మంత్రి లోకేష్ తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఆరోపణలు చేయాలంటే ఆధారాలతో సభకు రావాలి. గత పదేళ్లుగా మా బాబు పుట్టినరోజు మార్చి 21 తిరుమలలో అన్నదానం చేస్తున్నాం. అలాంటి మాపై ఆరోపణలు చేస్తున్నారు. టెండర్ లో ఎల్-3 వస్తే రాదు.. ఎల్-1 వారికి మాత్రమే వస్తుంది. కామన్ సెన్స్ ఉండాలి. లడ్డూలో కల్తీ అంశం తప్ప వైసీపీ సభ్యులు అన్నీ మాట్లాడతారు. సీబీఐ ఇచ్చిన రిపోర్ట్ లో కల్తీ జరిగిందని చాలా స్పష్టంగా చెప్పింది. వైవీ సుబ్బారెడ్డి కూడా కల్తీ జరిగిందని ఒప్పుకున్నారు. ఇప్పుడు నెయ్యి మార్కెట్ ధర పెరిగింది. కల్తీ చేసి రూ.300కి నెయ్యి సప్లై చేయమంటారా? వైసీపీ కల్తీ చేసినట్లు చేయమంటారా? మార్కెట్ ప్రైస్ ఎంతుందో ఈ రోజు కామన్ సెన్స్ తో గూగుల్ లో చెక్ చేసుకోవచ్చు. కావాలని ఆరోపణలు చేస్తున్నారు. దేవుడంటే మా కుటుంబానికి అపారమైన గౌరవం. మాకు రైట్ ఉన్నా తిరుమలలో ఏనాడూ ముఖద్వారం నుంచి వెళ్లలేదు. క్యూ కాంప్లెక్స్ నుంచి వెళ్లిన ఘనత మాది. మీ నాయకుడు జగన్ రెడ్డి డిక్లరేషన్ పై కనీసం సంతకం పెట్టలేదు. మీరా మాట్లాడేది అంటూ నిలదీశారు. కల్తీ జరగలేదని చెప్పడానికి సిగ్గుండాలని, దేవుడు మిమ్మల్ని వదిలిపెట్టడని మండిపడ్డారు.

# కందకుర్తి వద్ద గోదావరి పుష్కరాల ఘాట్లను సందర్శించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఐపీఎస్ రెంజల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కందకుర్తి పుష్కర ఘాట్లను పర్యవేక్షించడం జరిగింది. ఇందులో భాగంగా 2027 సంవత్సర కాలంలో రాబోయే గోదారి పుష్కరాలతో ఉద్దేశించి పుష్కర ఘాట్ల ఏర్పాట్లు , మహిళలు దుస్తులు మార్చుకునే గదులు , పుష్కర ఘాటుకు వచ్చే రోడ్డు , వెళ్లే దారులను , పార్కింగ్ ప్రదేశాల మరియు నీళ్లలో ఎవరు కూడా మునిగి ప్రాణా నష్టం జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటులను చేయాలని అధికారులకు సూచించారు గ్రామస్తులతో మాట్లాడి గత పుష్కరాల్లో ఏమేం లోటుపాట్లు ఉన్నాయి అడిగి తెలుసుకున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి పార్కింగ్ సమస్యలు , ఇతర అవరోధాలు కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పినారు. ఈ సందర్భంగా బోధన్ ఎ.సి.పి శ్రీనివాస్ , బోధన్ రూరల్ సర్కిల్ సిఐ విజయ్ బాబు, రెంజల్ ఎస్. ఐ. చంద్రమోహన్ , కందకుర్తి సర్పంచ్ ఉపసర్పంచ్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ చట్టాలు ఐ డోంట్ కేర్




- ▶ రెండుసార్లు సీజ్ చేసిన భవనం మళ్లీ ప్రారంభానికి సిద్ధం
- ▶ కాప్రా సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల దందా బహిర్గతం
- ▶ స్థానిక ఎమ్మెల్యే పేరుతో అధికారులు అక్రమ నిర్మాణాలు చేయిస్తున్నారా.?



**కాప్రా (ప్రశ్న న్యూస్)** జిహెచ్ఎంసి పరిధిలో విధులు నిర్వహించే అధికారులు మున్సిపల్ చట్టాలను "ఐ డోంట్ కేర్ నాకు లంచం ఇస్తే నేను ఏదైనా చేస్తాను" అన్నట్లుగా మార్చేశారు పరిస్థితి. అందుకు అనుగుణంగా ఉన్నత అధికారులు కూడా మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. దానికి తోడు మున్సిపల్ చట్టంపై ప్రజలకు విశ్వాసం పూర్తిగా సన్నగిల్లిపోయింది.

అధికారులకు డబ్బులు ఇస్తే అవినీతి అక్రమాలకు 'సై' ఇంకా చట్టాలు ఎందుకు అన్నట్లుగా మార్చేశారు. కాప్రా సర్కిల్ పరిధిలో కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల కథ మరోసారి వెలుగులోకి వచ్చింది. జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు రెండుసార్లు సీజ్ చేసిన భవనం తిరిగి యదేచ్ఛగా ప్రారంభానికి



సిద్ధమవుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "చట్టాలు ఉన్నాయా.? లేక అధికారుల చేతుల్లో బొమ్మలేనా.?" అన్న ప్రశ్నలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. అయిన ఉన్నత అధికారులు మాత్రం స్పందించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

### రెండుసార్లు సీజ్... మళ్లీ ఓపెన్... ఇదే లంచాల స్టైల్..

జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగం నిబంధనల ప్రకారం అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే సీజ్ చేసి, తదుపరి కూల్చివేత చర్యలు తీసుకోవాలి. కానీ కాప్రా సర్కిల్‌లో మాత్రం కథ వేరేలా ఉంది. రెండుసార్లు సీజ్ చేసిన భవనంలో అధికారులు దాదాపు 10 లక్షల వరకు లంచాలు తీసుకొని అదే భవనంలో తిరిగి పనులు ప్రారంభానికి సహకరిస్తున్నారన్న స్థానికుల ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులను వివరణ కోరగా అధికారుల మౌనం

ఈ పరిణామాలు మున్సిపల్ చట్టాల పట్ల ప్రజల్లో తీవ్ర అపనమ్మకాన్ని కలిగిస్తున్నాయి. అయితే ఇందులో ఏ ఏ అధికారికి ఎంతస్థాయిలో మామూళ్ళు అందాయో అన్న అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

### డిప్యూటీ కమిషనర్, ఏసిపి, సెక్షన్ ఆఫీసర్ పై ఆరోపణలు

స్థానికుల ఆరోపణల ప్రకారం, కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన డిప్యూటీ కమిషనర్, ఏసిపి, సెక్షన్ ఆఫీసర్ స్థాయిలోనే వ్యవహారం 'సెటిల్' అవుతోందని ప్రచారం జోరందుకుంది. ప్రత్యేకంగా సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ ప్రైవేటు వ్యక్తులతో కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. అధికారికంగా రెండుసార్లు సీజ్ చేసిన భవనం తిరిగి ప్రారంభం కావడం వెనుక భారీ లావాదేవీలు జరిగాయా.? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి ఒక్కసారి ఫీజ్ చేసిన భవనాన్ని తిరిగి ప్రారంభిస్తే యజమాని లేదా బిల్డర్ పై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయాలి. మరి దీనిపై ఎందుకు నమోదు చేయలేదు ఒకవేళ కేసు నమోదు చేస్తే మరి పోలీసులు ఎందుకు దీనిపై కఠినంగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే రాజకీయ నాయకుల పేరు చెప్పి అధికారులే అక్రమాలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు, చర్యలు శూన్యం

కాప్రా సర్కిల్ లో జరుగుతున్న అవినీతి అక్రమ వ్యవహారంపై స్థానికులు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు కనిపించలేదని, ఫిర్యాదులు ఫైళ్లకే పరిమితమయ్యాయా.? లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారా.? అన్న ప్రశ్నలు స్థానికల నుండి ఉత్పన్నమవుతున్నాయి. జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకుంటే ఇక జిహెచ్ఎంసి లో అవినీతి అక్రమాలే రాజ్యమేలుతాయని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### స్థానిక ఎమ్మెల్యే హస్తమా.?


అక్రమ నిర్మాణదారులకు "స్థానిక ఎమ్మెల్యే ఆశీస్సులు ఉన్నాయ్" అంటూ ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు పరిస్థితిని మరింత అనుమానాస్పదంగా మారుస్తున్నాయి. ఇది కేవలం ప్రచారమా.? లేక నిజంగానే రాజకీయ ఆశ్రయం ఉందా.? అనేది ప్రజలకు తెలియాల్సిన విషయం అయితే స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేరు వినిపిస్తున్న ఆయన అక్రమ నిర్మాణాల వ్యవహారాన్ని ఖండించకపోవడం కూడా పలు అనుమానాలు తాగిస్తోంది. ఇదే కాకుండా కొంతమంది ఎమ్మెల్యే చెంచాలు ఎమ్మెల్యే పేరుని వాడుకొని ఇలా అక్రమాలకు పాల్పడుతున్నారా.? లేక అధికారులు ఎమ్మెల్యే పేరు చెప్పి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారా.? అన్నదానిపై ఎమ్మెల్యే ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తే బాగుంటుందని ప్రజలు సూచిస్తున్నారు.

### చట్టాలపై ప్రజల నమ్మకం ఎక్కడ.?

ఒక భవనాన్ని రెండుసార్లు సీజ్ చేసి కూడా తిరిగి ప్రారంభమవుతుంటే ప్రభుత్వచట్టాల గౌరవం ఎక్కడ.? ఉంటుందని ఇంత జరుగుతున్న అధికారుల బాధ్యత ఎక్కడ.? ఉందని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడాన్ని ఎవరు ఆపాలి.? అన్నదానిపై ఎప్పుడు ప్రజలలో సందిగ్గం నెలకొన్నది. అక్రమ నిర్మాణాలు కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు, భవిష్యత్తులో ప్రాణ నష్టాలకు కూడా కారణమవుతాయి. నగరంలోని చాలా అక్రమ నిర్మాణాలలో ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు పోయిన ప్రభుత్వంలో మాత్రం స్పందన రాలేదు. అయిన అధికారుల నిర్లక్ష్యం ఎందుకు.? అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండుసార్లు సీజ్ చేసిన భవనం వివరాలను ప్రజలకు బహిరంగంగా వెల్లడించాలి. సహకరిస్తున్న అధికారుల పై విజిలెన్స్ విచారణ చేపట్టాలని అక్రమ నిర్మాణంపై తక్షణ కూల్చివేత చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు మరి దీనిపై ఉప్పల్ జోనల్ కమిషనర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# అంబర్ పేట సర్కిల్‌లో చైన్ మెన్ అశ్విన్‌దే అవినీతి రాజ్యం

- బురుజు గల్లిలో ఎలాంటి అనుమతు లేకుండా యదేచ్ఛగా అక్రమ నిర్మాణం
- చైన్ మెన్ అశ్విన్ జెడ్ సి కంటే ఎక్కువ కమిషనర్ కంటే తక్కువ అందుకే ఫోన్ ఎత్తురా.?
- నోటీసులు ఇచ్చామని చెప్పడానికే పరిమితమైన న్యాక్ ఇంజనీర్లు
- ఒక్క నోటీసుతో కాలక్షేపం వెనక వెనుక లంచాలే కారణమా.?
- జిహెచ్ఎంసి ఆదాయానికి గండి, చైన్ మెన్ అశ్విన్, అధికారుల జేబుల్లోకి ఆదాయం
- ఒక పక్కా జీతాలు, వంద అక్రమాలలో లంచాలు కోట్లకు పడగలెత్తుతున్న ప్రభుత్వ సిబ్బంది, అధికారులు



**అంబర్ పేట (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ అధికారులకు ఒకపక్క జీతం, వందలలో అక్రమ నిర్మాణాల వద్ద లంచాలు అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా మారింది పరిస్థితి. అంబర్ పేట సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. బురుజు గల్లి ప్రాంతంలో అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారినా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనక లంచాలే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండా చైన్ మెన్, న్యాక్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు లంచాలు ఇస్తే చాలు మీరు యదేచ్ఛగా నిర్మాణం చేసుకోవచ్చు. నిబంధనలు పాటించకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేసినా పట్టించుకోరు. స్థానికులు ఫిర్యాదులు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు అసలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు కళ్ల ముందు కనిపిస్తున్నా, నోటీసులు ఇవ్వకుండా, పనులు ఆపకుండా డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం వహించడం వెనక భారీగా ముడుపులు అందాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### లంచాలు ఇస్తే నో యాక్షన్ ఓన్లీ మౌనం.?

డబ్బు ఇస్తే చాలు నిర్మాణాలకు నిబంధనలు అక్కర్లేదు అన్నట్లు మారింది పరిస్థితి. అక్రమ నిర్మాణాల వెనుక మున్సిపల్ అధికారులకు భారీగా లంచాలు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, న్యాక్ ఇంజనీర్లు, చైన్ మెన్ లు కలిసి అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారు. అందుకోసమే బురుజు గల్లీలో పక్కింటి నెంబర్ 2-2-474 పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంటే అధికారులు లంచాలు తీసుకుని జిహెచ్ఎంసి ఆదాయానికి గండికోటి నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తున్నారని పత్రికలో కథనాలు వచ్చిన అధికారులు స్పందించడం లేదంటే ఎంత భారీ స్థాయిలో లంచాలు అందాయో అర్థం చేసుకోవచ్చు అని స్థానికులు ఆరోపిస్తున్నారు. నోటీసులు ఇచ్చారు చర్యలు తీసుకుంటాం అంటూ కాలం గడుపుతున్నారు తప్ప చర్యలు తీసుకోకపోవడం పై చైన్ మెన్ అశ్విన్ చక్రం తిప్పుతున్నారని కమిషనర్ అక్రమ నిర్మాణాలపై సీరియస్ గా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.


### అక్రమ నిర్మాణాలకు డిప్యూటీ కమిషనర్ అండదండలా.?

అంబర్ పేట సర్కిల్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ అసలు పట్టించుకోవడంలేదని ఆయన నిర్లక్ష్యంతోనే టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది అక్రమ నిర్మాణాలను చేయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏసిపి, సెక్షన్ ఆఫీసర్ ఎవరు ఫోన్ ఎత్తరని కేవలం వాళ్లకు డబ్బులు ఇచ్చే వాళ్లయితేనే ఫోన్లు ఎత్తుతారా అంటూ ప్రజల ప్రశ్నిస్తున్నారు. ఇందులో చైన్ మెన్ అశ్విన్ కీలక పాత్ర పోషిస్తున్నాడని ఆయన అవినీతికి హద్దు అదుపు లేకుండా పోయిందని వివరణ కోసం ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తడం లేదని సాక్షాత్ జిహెచ్ఎంసి కమిషనర్ జోనల్ కమిషనర్లు కూడా ఫోన్ ఎత్తుతారు అంతకంటే పెద్ద అధికారిలాగా చైన్ మెన్ అశ్విన్ వ్యవహారం ఉందని ఎందుకు కారణం ఆయన అధికారులకు భారీగా అక్రమ నిర్మాణాల వద్ద నుండి లంచాలు వసూలు చేసి ఇవ్వడం వల్ల అధికారులు కూడా ఆయనపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇలా అధికారులు, సిబ్బంది ఎలాంటి అనుమతులు లేని అక్రమ నిర్మాణం పై కూడా చర్యలు తీసుకోవడానికి కాకమ్మ కబుర్లు చెబుతున్నారని అంటే వీళ్లకు జిహెచ్ఎంసి నిబంధనలు లెక్కలేదు, ఉన్నత అధికారులు అంటే భయం లేదు. ఇలా ఉంది జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్, కమిషనర్ పాలన ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ భవనం పై చర్యలు తీసుకుంటారో లేక లంచాలలో వాటా అడుగుతారో వేచి చూడాలి.

## 26 రకాల వివరాలతో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

### - ఎఫ్‌బీఎంఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చేలా రూపొందిస్తున్న 'ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఎఫ్ బీఎంఎస్)పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అసెంబ్లీలోని తన చాంబర్‌లో అధికారులతో ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ ఐడీ, ఆధార్, రైస్ కార్డ్, మొబైల్ నెంబర్, విద్యార్హతలు, వృత్తి, చిరునామా, వ్యవసాయ భూమి, ఇతర ఆస్తుల వివరాలు వంటి మొత్తం 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ డేటాబేస్ రూపకల్పన కోసం ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, డిస్కమ్స్, పురపాలక శాఖ, వెబ్‌ల్యాండ్, వాహన్, హెచ్‌ఆర్ఎంఎస్, పంచాయతీరాజ్, మార్క్‌ఫెడ్ వంటి వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని సేకరించి ఇందులో పొందుపరచాలని సీఎం సూచించారు. ప్రస్తుతం 82 శాతం సమాచారం సిద్ధంగా ఉందని, వచ్చే ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ పూర్తిచేస్తామని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. ప్రభుత్వంలోని అన్ని శాఖల వద్ద ఉన్న డేటాను సమీకృతం చేయడం ద్వారానే సమాచారంలో కచ్చితత్వం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 'ఫ్యామిలీ కార్డు' అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దీనికి అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

## వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

### - హైడ్రా కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వేసవి కాలం ప్రారంభమైనందున అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. హైదరాబాద్‌లోని బాచుపల్లిలో నిన్న భారీ అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ప్రధాన రహదారి వెంబడి పలు దుకాణాలు దగ్ధం కాగా, సుమారు రూ.5 కోట్ల నష్టం జరిగింది. ఈ ప్రమాద స్థలాన్ని రంగనాథ్ పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలంలో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరూ అవగాహన పెంచుకోవాలని రంగనాథ్ సూచించారు. తనిఖీలు చేసినంత మాత్రాన అగ్నిప్రమాదాలను నియంత్రించలేమని అన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఏంచేయాలనే వాటిని అందరూ పాటించినప్పుడే ఫలితాలు ఉంటాయని అన్నారు. ఏళ్లుగా కష్టపడి సంపాదించుకున్న ఆస్తులు ఒక్క ప్రమాదంతో బూడిద అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అగ్ని ప్రమాదం సంభవించిన ఒక్కో దుకాణంలో రూ.25 లక్షలకు పైగా ఫర్నీచర్ ఉందని నిర్వాహకులు చెబుతున్నారని, మొత్తం 22 దుకాణాలు కాలి బూడిద అయ్యాయని తెలిపారు. ఇది దుకాణ యజమానులకు తీరని నష్టమని ఆయన అన్నారు. నష్టపరిహారం రెవెన్యూ విభాగం చూసుకుంటుందని తెలిపారు. అయితే ప్రమాదాలు నివారించడానికి మనం జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తనిఖీలతో పాటు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పట్టించుకోని వారిపై చర్యలు తీసుకునే అధికారం హైడ్రాకు కట్టబెట్టాలని రంగనాథ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఏఐ ఆయుధాలు రంగంలోకి దించిన అమెరికా

### - ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, నౌకాదళమే ప్రధాన లక్ష్యం



**న్యూయార్క్ (ప్రశ్న న్యూస్)** ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక ఘర్షణలో అమెరికా సరికొత్త టెక్నాలజీని వాడుతోంది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో చేపట్టిన ఈ యుద్ధంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అటానమస్ వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ బుధవారం నాడు ధృవీకరించారు. పెంటగాన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్మార్ట్ ఏఐ సామర్థ్యాలున్న డ్రోన్లు, ఇతర వ్యవస్థలను రంగంలోకి దించినట్లు తెలిపారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా వాటి పూర్తి వివరాలను వెల్లడించలేనని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటివరకు 2,000కు పైగా లక్ష్యాలను ధ్వంసం చేశామని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్, జనరల్ డాన్ కెయిన్ తెలిపారు. ప్రధానంగా మూడు లక్ష్యాలతో ఈ దాడులు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థలను పూర్తిగా నాశనం చేయడం, వారి నౌకాదళాన్ని నిర్వీర్యం చేయడం, తిరిగి సైనిక సామర్థ్యాన్ని వేగంగా పునరుద్ధరించుకోకుండా చూడటమే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. యుద్ధ వ్యూహాన్ని కూడా మార్చినట్లు అమెరికా సైన్యం తెలిపింది. దూరం నుంచి జరిపే దాడుల స్థానంలో, ఇప్పుడు నేరుగా ఇరాన్ గగనతలంలోకి వెళ్లి కచ్చితమైన లక్ష్యాలపై దాడులు చేస్తున్నామని జనరల్ కెయిన్ చెప్పారు. తమ దాడుల తర్వాత ఇరాన్ క్షిపణి ప్రయోగాల తీవ్రత గణనీయంగా తగ్గిందని, పోరాటం మొదలైన నాటితో పోలిస్తే ఇవి 86 శాతం తగ్గాయని వెల్లడించారు. అయితే, ఈ ఆపరేషన్ ఇంకా ముగియలేదని, ఇది చాలా సంక్లిష్టమైనది, ప్రమాదకరమైనదని ఆయన పేర్కొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588